www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

**విలేకరులు కావలెను**

18 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు,నియోజకవర్గాల, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039

సంపుటి : 17 | సంచిక : 153 | మంగళవారం 21.07.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-

# వాదనలు బలంగా ఉండాలి..

## రాద్ధాంతం కాదు.. వాస్తవాలే మాట్లాడాలి



**రాహుల్ గాంధీపై ప్రధాని మోదీ వ్యంగ్యాస్త్రాలు ..56 ఏళ్ల యువకుడు అంటూ..**

- పార్లమెంట్ సమావేశాలకు ముందు ప్రధాని మోదీ కీలక సందేశం
- తర్కం, వాస్తవాలతో చర్చలు జరగాలని ప్రధాని పిలుపు
- రాద్ధాంతం కాదు.. వాస్తవాలే మాట్లాడాలని మోదీ
- దేశ ప్రయోజనాలే పార్లమెంట్ లక్ష్యమన్న ప్రధాని
- సజావుగా సాగాలని వర్షాకాల సమావేశాలపై ఆకాంక్ష
- ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయాలని పిలుపు
- ప్రతిపక్షాలు నిర్మాణాత్మకంగా వ్యవహరించాలని సూచన
- వాస్తవాలు బలంగా ఉంటే గొంతు పెంచాల్సిన అవసరం లేదన్న మోదీ
- దేశాభివృద్ధికి పార్లమెంట్ వేదిక కావాలని ఆకాంక్ష
- ప్రజా సమస్యలపై సార్థక చర్చలకు ప్రధాని పిలుపు

05

**ప్రపంచం కోసం భారత్ నుంచే పనిచేస్తాం**

# దద్దరిల్లిన రాజ్యసభ

## మోదీ ప్రభుత్వానికి దమ్ము లేదు: ఖర్గే



**అయోధ్య విరాళాల అంశాన్ని లేవనెత్తిన ఖర్గే నీట్ వివాదం పార్లమెంట్‌ను కుదిపేసింది**


- పార్లమెంట్ తొలి రోజే ఢిల్లీలో ఉద్రిక్తత
- 'చలో సంసద్' ర్యాలీతో రాజధానిలో ఉద్రిక్త పరిస్థితులు
- విద్యాశాఖ మంత్రి రాజీనామా డిమాండ్
- జంతర్ మంతర్ వద్ద నిరసనకారులను అడ్డుకున్న పోలీసులు
- పోలీసులు-నిరసనకారుల మధ్య తోపులాట
- నిరసనకారులపై పోలీసుల బలప్రయోగం
- పర్మిషన్ లేకపోవడంతో ర్యాలీకి బ్రేక్
- 'చలో సంసద్' మార్చ్ ఉద్రిక్తంగా మారింది

03

**సీజేపీ ఆందోళనలపై రాజ్యసభలో గందరగోళం..**

# సోనమ్ వాంగ్‌చుక్ సంచలన లేఖ

**నా షరతులను ఒప్పుకుంటే దీక్ష విరమిస్తా..**



- 20 రోజులుగా సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష
- దీక్ష విరమణకు మూడు షరతులు
- ప్రభుత్వానికి సోనమ్ వాంగ్‌చుక్ అల్టిమేటం
- చేతిరాత లేఖను విడుదల చేసిన సోనమ్
- 'షరతులు నెరవేరితేనే దీక్ష విరమిస్తా'
- సఫ్దర్‌జంగ్ ఆస్పత్రిలో అక్రమ నిర్బంధమన్న ఆరోపణ
- నీట్ లీకేజీపై ప్రభుత్వమే బాధ్యత వహించాలన్న డిమాండ్
- విద్యావ్యవస్థ వైఫల్యాలపై ప్రభుత్వాన్ని నిలదీసిన సోనమ్
- నీట్ అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తాలని డిమాండ్
- రాజకీయ పార్టీల నుంచి హామీ కోరిన సోనమ్
- అగ్రనేతలు ఆస్పత్రికి రావాలన్న విజ్ఞప్తి

05



# పట్టణ పేదలకు తీపి కబురు

**క్యూర్ పరిధిలో లక్ష ఇళ్లు..**

- నేటి నుంచి క్యూర్ ఫ్లాట్ల దరఖాస్తుల స్వీకరణ
- ఆగస్టు 10 వరకు దరఖాస్తులకు అవకాశం
- రూ.10 వేల టోకెన్‌తో అప్లికేషన్ నమోదు
- మీ సేవ, వాట్సాప్, వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు
- డ్రా పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక
- డ్రాలో ఎంపిక కాకపోతే టోకెన్ మొత్తం తిరిగి
- 10 ఏళ్ల పాటు ఫ్లాట్ల విక్రయం, అద్దెకు నిషేధం
- కుటుంబానికి ఒక్కరికి మాత్రమే దరఖాస్తు అవకాశం

03

**"తొలి విడతలో" ప్రతి నియోజకవర్గానికి 500 ఇళ్లు**

పేదలకు ఇళ్లు ఇస్తామంటే కొందరు హేళన చేశారు..

# తెలంగాణలో బీజేపీ ఆపరేషన్ ఆకర్ష్..!

**కాంగ్రెస్, బీఆర్ఎస్ అలర్ట్.. వారి గురించి ఆరా!**

## కమలం వ్యూహాలతో రాష్ట్ర రాజకీయాల్లో హీట్

- బీజేపీ జాతీయ నాయకత్వం ఫుల్ ఫోకస్
- నెలరోజుల్లో సంచలన పరిణామాలు?
- తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ దూకుడు
- ఆపరేషన్ ఆకర్ష్‌కు బీజేపీ శ్రీకారం
- ఇతర పార్టీల నేతలకు బీజేపీ గాలం
- బీజేపీలో చేరికలకు డోర్స్ ఓపెన్
- రాష్ట్ర రాజకీయాల్లో బీజేపీ కొత్త ప్లాన్
- నితిన్ నబీన్ పర్యటనతో కొత్త సంకేతాలు
- జేపీ నడ్డా టూర్‌పై రాజకీయ చర్చ
- త్వరలో అమిత్ షా, మోదీ పర్యటన?
- జాతీయ నేతల వరుస పర్యటనలకు ప్లాన్

02

**నెల రోజుల్లో ఊహించని పరిణామాలు**




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :**
తెలంగాణలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ పార్టీ ఫోకస్ పెంచింది. ఇన్నాళ్లు అందని ద్రాక్షగా మిగిలిన పశ్చిమబెంగాల్ దక్కించుకున్న కమలనాథులు అదే స్ట్రాటజీతో తెలంగాణ గడ్డపై కాషాయ జెండా ఎగురవేయాలనే ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ క్రమంలో గతానికి భిన్నమైన వ్యూహాలతో రాజకీయం కొనసాగిస్తుండటం ఇప్పుడు స్టేట్ పాలిటిక్స్ లో ఆసక్తిని పెంచుతోంది. నిన్నా మొన్నటి వరకు రాష్ట్ర నేతల అంతర్గత కుమ్ములాటలతో విసిసిగిపోయిన పార్టీ జాతీయ నాయకత్వం..

# పామాయిల్ ధర పెరిగింది..

## గోద్రెజ్‌కు అన్ని వసతులు కల్పిస్తాం



**టన్ను పామాయిల్ ధర రూ.23 వేలకు పెరిగింది**

**రుతుపవనాలపై ఎల్‌నినో ప్రభావం**

- ఎల్‌నినో ప్రభావంపై మంత్రి తుమ్మల ఆందోళన
- ఉద్యానవన పంటలతో భూములను చల్లబరచాలి
- వ్యవసాయంలో వాతావరణ మార్పుల ప్రభావం
- రైతులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్న ప్రభుత్వం
- ఆయిల్ పామ్‌తో రైతులకు స్థిరమైన ఆదాయం
- వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- ఖమ్మం రైతులకు కొత్త అవకాశాల దారి
- ఆయిల్ పామ్ పరిశ్రమతో స్థానిక ఉపాధికి ఊతం
- పామాయిల్ రంగంలో తెలంగాణకు మరో ముందడుగు
- ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి

05



# ట్రైనీ ఐపీఎస్ ఆత్మహత్య యత్నం..!

**ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి సస్పెన్షన్**

**నాపై ఆరోపణలు పూర్తిగా అవాస్తవం**

- ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నం
- విషం తాగి తీవ్ర అస్వస్థతకు గురైన ట్రైనీ ఐపీఎస్
- మోతీనగర్‌లో బంధువుల ఇంట్లో విషం సేవించిన ఉదయ్
- ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స.. పరిస్థితి విషమం

03

# రైతులకు యూరియా లేదు..

**ఎవరైనా తెలిసి తెలిసి మునిగే పడవను ఎక్కుతారా?**

**రిజర్వాయర్లు డెడ్ స్టోరేజీకి.. ప్రభుత్వం కోల్డ్ స్టోరేజ్‌లో**

**దేవుళ్లపై ఒట్లు.. ప్రజలపై అబద్ధాలు**

## కుడితిలో పడిన ఎలుకలా పోచారం పరిస్థితి

**బాన్సువాడలో బీఆర్ఎస్ బలమేంటో చూపిస్తామన్న కేటీఆర్**

**గులాబీ శ్రేణుల్లో జోష్ నింపిన కేటీఆర్**

- కాంగ్రెస్, సీఎం రేవంత్‌పై కేటీఆర్ ఘాటు విమర్శలు
- బాన్సువాడలో మళ్లీ గులాబీ జెండా ఎగురుతుందన్న కేటీఆర్
- పోచారం పార్టీ మార్పుపై కేటీఆర్ ఫైర్
- పోచారం రాజకీయ భవిష్యత్తు ముగిసిందన్న కేటీఆర్
- కాంగ్రెస్‌లో చేరి ఇప్పుడు గిలగిలా కొట్టుకుంటున్నారన్న వ్యాఖ్యలు
- ఏ ఎన్నిక వచ్చినా పోచారాన్ని ఓడిస్తామని పిలుపు
- దేవుడిపై ఒట్టు పెట్టి మాట తప్పారని పోచారంపై ఆరోపణలు
- రేవంత్‌కు తిట్లు, ఒట్లు మాత్రమే వచ్చన్న కేటీఆర్
- 'షాప్‌లో లేని యూరియా యాప్‌లో ఎలా ఉంటుంది?'
- కాళేశ్వరం మరమ్మతులపై ప్రభుత్వానికి కేటీఆర్ ప్రశ్నలు
- రిజర్వాయర్లు డెడ్ స్టోరేజ్‌కు.. ప్రభుత్వం కోల్డ్ స్టోరేజ్‌లోకి
- కాంగ్రెస్ హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్
- ఎన్నికల ముందు మళ్లీ కాంగ్రెస్ మాటలు నమ్మే పరిస్థితి లేదన్న కేటీఆర్

03



# ప్రైవేటు స్కూళ్ల ఫీజుల దోపిడీకి చెక్!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలల్లో తల్లిదండ్రులను పీడిస్తూ సాగుతున్న విచ్చలవిడి ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ తీవ్ర నిర్ణయం తీసుకుంది. ప్రైవేటు స్కూళ్లు వసూలు చేసే ట్యూషన్ ఫీజుల వివరాలను కచ్చితంగా పాఠశాల నోటీసు బోర్డులతో పాటు తమ అధికారిక వెబ్‌సైట్లలో స్పష్టంగా ప్రదర్శించాలని సంచలన ఆదేశాలను జారీ చేసింది.

**ఆడిట్ రిపోర్ట్ అప్‌లోడ్ తప్పనిసరి..**

అయితే, కేవలం స్కూళ్ల ఫీజు వివరాలు వెల్లడించడమే కాకుండా, ప్రైవేట్ స్కూళ్లు తమ ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన 2023-24, 2024-25 విద్యా సంవత్సరాలకు సంబంధించి సీఏ ధృవీకరించిన ఆడిట్ రిపోర్టులను జులై 30లోగా విద్యాశాఖ అధికారిక పోర్టల్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించింది. నిర్దేశిత గడువులోగా ఆడిట్ నివేదికలను సమర్పించని పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది.

**ఫీజుల నియంత్రణకు త్వరలోనే చట్టం?**

మరోవైపు, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 12 వేలకు పైగా ఉన్న ప్రైవేటు పాఠశాలలు ఏటా ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచుతుండటంతో తల్లిదండ్రుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. ఈ క్రమంలో పాఠశాలల్లో మౌలిక
వసతులు, సౌకర్యాల ఆధారంగా ఫీజులను నియంత్రించేందుకు, అదనపు వసూళ్లను కట్టడి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఫీజుల నియంత్రణ చట్టం తీసుకొచ్చేందుకు ఓ ప్రత్యేక కమిటీ వేయాలని ఆలోచన చేస్తోంది. అయితే, విద్యాశాఖ తీసుకున్న ఈ కఠిన నిర్ణయంతో ప్రైవేటు పాఠశాలల ఇష్టారాజ్యానికి అడ్డుకట్ట పడనుంది




# త్వరలో విలీన ప్రక్రియ

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఆర్టీసీలో ఒక్కొక్క సమస్యను పరిష్కరిస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. యూనియన్ ఎన్నికల తర్వాత ఆర్టీసీ విలీన ప్రక్రియ కూడా ప్రారంభిస్తామన్నారు. ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన నర్సంపేట ఆర్టీసీ డిపో డ్రైవర్ కోలా శంకర్ కుటుంబ సభ్యులకు TGRTC ఉద్యోగుల చేయూత కార్యక్రమం ద్వారా 90 లక్షల 85 వేల 500 రూపాయల చెక్కును వారి కుటుంబ సభ్యులకు ఇవాళ మంత్రి పొన్నం ప్రభాకర్ అందజేశారు. ఆర్టీసీ కళాభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మాట్లాడిన మంత్రి.. సంస్థ పరిరక్షణ ప్రయాణికుల సౌలభ్యం కార్మికుల సంక్షేమ మూడు ప్రధాన అంశాలుగా పని చేస్తున్నామని చెప్పారు. డ్రైవర్ శంకర్ ఆసుపత్రిలో ఉన్నప్పుడు అర్ధరాత్రి వెళ్ళి ఆయన ఆరోగ్య పరిస్థితిపై తెలుసుకున్నామని మంత్రి చెప్పారు. శంకర్ కుమారుడు కుటుంబానికి ఇల్లు మంజూరు చేశామని ఆయన కుమారుడు హేమంత్‌కు ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు.

**ఎంఎంటీఎస్, మెట్రోకు ఆర్టీసీ అనుసంధానం**

గ్రామాల నుండి రాజధాని వరకు కొత్త రూట్‌లలో బస్సులు నడిపిస్తున్నామని, ఆర్టీసీ పేదవాడి గుండె చప్పుడు పేదవాడికి సౌకర్యం ఉండే విధంగా యాజమాన్యం తీసుకుంటున్న చర్యల్లో మరింత బాధ్యతగా పని చేయాలన్నారు. క్యూర్ ఏరియా పరిధిలో బస్ టెర్మినల్ నిర్మించుకుందామని మంత్రి తెలిపారు. ఎంఎంటీఎస్, మెట్రోకు ఆర్టీసీ అనుసంధానం చేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ హాయంలో ఆర్టీసీ సంఘాలు ఎత్తివేసి నిరంకుశంగా వ్యవహరించారని కానీ ప్రజా ప్రభుత్వం రాగానే మహా లక్ష్మి పథకాన్ని ప్రారంభించి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించి నెలకు ఆర్టీసీకి 300 కోట్లు విడుదల చేస్తోందన్నారు. రిటైర్డ్ కార్మికుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి చెప్పారు. కార్మికుల సంక్షేమానికి వెనుకాడబోమని స్పష్టం చేశారు.

# తెలంగాణలో బీజేపీ ఆపరేషన్ ఆకర్ష్..!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ పార్టీ ఫోకస్ పెంచింది. ఇన్నాళ్లు అందని ద్రాక్షగా మిగిలిన పశ్చిమబెంగాల్ దక్కించుకున్న కమలనాధులు అదే స్ట్రాటజీతో తెలంగాణ గడ్డపై కాషాయ జెండా ఎగురవేయాలనే ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ క్రమంలో గతానికి భిన్నమైన వ్యూహాలతో రాజకీయం కొనసాగిస్తుండటం ఇప్పుడు స్టేట్ పాలిటిక్స్ లో ఆసక్తిని పెంచుతోంది. నిన్నా మొన్నటి వరకు రాష్ట్ర నేతల అంతర్గత కుమ్ములాటలతో విసిసిగిపోయిన పార్టీ జాతీయ నాయకత్వం.. ఇక స్వయంగా రంగంలోకి దిగడమే కాకుండా నెలరోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో సంచలనాలు ఉండబోతున్నాయని వ్యాఖ్యానించడం హాట్ టాపిక్‌గా మారింది.

**మొన్న నడ్డా.. తాజాగా నితిన్ నబీ:**

రాష్ట్ర స్థాయి నేతల్లో ఉన్న విభేదాలను తొలగించి వారి మధ్య సఖ్యతను తీసుకువచ్చేలా చేయడంతో పాటు పార్టీ శ్రేణుల్లో ఎప్పటికప్పుడు ఉత్సాహం నింపేలా ఇకపై నెలకు ఒకసారి జాతీయ స్థాయి నేత ఒకరు రాష్ట్రంలో పర్యటించేలా ప్రక్క ప్రణాళిక వేసుకున్న బీజేపీ అందుకు తగ్గట్టుగా కార్యాచరణను ఎగ్జిక్యూటీవ్ చేస్తోంది. గతంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు రాష్ట్రంలో ఒక పూటకో ఒక రోజుకో పర్యటనకు వచ్చేవారు. కానీ ఇటీవల కొత్తగా పార్టీ జాతీయ బాధ్యతలు తీసుకున్న నితిన్ నబీన్ మాత్రం గత నెలాఖరులో ఏకంగా మూడురోజుల పాటు తెలంగాణలో పర్యటించడం ఆసక్తిని రేపింది. ఆ తర్వాత వెంటనే మాజీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా పర్యటించడం రాష్ట్ర రాజకీయాల్లో డిస్కషన్‌గా మారింది. త్వరలోనే అమిత్ షా, ఆ తర్వాత ప్రధాని నరేంద్ర మోడీ ఇలా అగ్రనేతల వరుసగా పర్యటించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు టాక్ వినిపిస్తోంది.

**ఆపరేషన్ ఆకర్ష్.. నెల రోజుల్లో ఊహించని పరిణామాలు!:**

జాతీయ నాయకత్వం రాష్ట్రానికి వచ్చి వెళ్లడం ఒక ఎత్తైతే వచ్చిన నేతలు ఆపరేషన్ ఆకర్ష్ గురించి మాట్లాడటం స్టేట్ పాలిటిక్స్ లో సంచలనంగా మారుతోంది. ఈనెలారంభంలో తెలంగాణలో పర్యటించిన కేంద్ర మంత్రి జేపీ నడ్డా రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఇతర పార్టీలకు చెందిన పలువురు ముఖ్యనేతలు బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారనే సమాచారం తనకు ఉందని హాట్ కామెంట్స్ చేశారు. అలాగే వేరే పార్టీల నుంచి నాయకులు వచ్చినప్పుడే పార్టీ మరింత బలపడుతుందని, తన సొంత రాష్ట్ర అనుభవాలను మన రాష్ట్ర నేతలకు వివరించడం ఆసక్తిని రేపింది. ఈ క్రమంలో తాజాగా రాష్ట్ర పర్యటనకు వచ్చిన బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జి అభయ్ పాటిల్ వ్యాఖ్యలు సెన్సేషనల్‌గా మారాయి. పార్టీలోని ముఖ్య నాయకుల మధ్య నెలకొన్న వివాదాలను పరిష్కరించి అందరినీ ఒకే తాటిపైకి తీసుకొచ్చే ప్రయత్నాలు మొదలు పెట్టిన ఆయన.. రానున్న నెల రోజుల వ్యవధిలో తెలంగాణ బీజేపీలో ఊహించని రాజకీయ పరిణామాలు చోటు చేసుకోబోతున్నాయని సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా తాము త్వరలోనే డోర్స్ ఓపెన్ చేస్తున్నామని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఏ పార్టీల నుంచి ఎవరెవరు బీజేపీలోకి వస్తారో అంతా చూస్తారని అభయ్ పాటిల్ కామెంట్ చేశారు.

**కాంగ్రెస్, బీఆర్ఎస్ అలర్ట్!:**

తెలంగాణ విషయంలో బీజేపీ జాతీయ నాయకత్వం స్పీడ్ పెంచడంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ అలర్ట్ అయినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. బీజేపీ పెద్దలు మైండ్ గేమ్ ఆడుతున్నారా? లేక నిజంగానే తమ పార్టీ నేతలు వారితో టచ్‌లో ఉన్నారా అనే విషయాలను పార్టీ అంతర్గతంగా ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఇటీవల సొంత పార్టీ పట్ల అసంతృప్తిగా ఉన్న నేతల తాజా ఆలోచనలు? వారి నిర్ణయాలేంటి? అనే విషయాలను వారి సన్నిహితుల వద్ద కాంగ్రెస్, బీఆర్ఎస్ ముఖ్యనేతలు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి బీజేపీ వీడటం ఖాయం అనే చర్చ జరుగుతోంది. కాంగ్రెస్‌లోనూ పదవులు ఆశిస్తూ దక్కకని అసంతృప్త నేతలు పార్టీ మారే చాన్స్ ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఓ వైపు బీజేపీ ఆపరేషన్ ఆకర్ష్ మొదలు పెడుతామని బహిరంగంగానే ప్రకటనలు చేస్తున్న వేళ తమ తమ పార్టీల్లో పక్క చూపులు చూస్తున్న నేతలెవరూ అనేదానిపై కాంగ్రెస్, బీఆర్ఎస్ అప్రమత్తమైనట్లు తెలుస్తోంది.

# ట్రైనీ ఐపీఎస్ ఆత్మహత్య యత్నం..!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ట్రైనీ ఐపీఎస్ ఉదయ కృష్ణారెడ్డి పై లైంగిక ఆరోపణల కేసుకు సంబంధించి అత్తాపూర్ పోలీసులు దర్యాప్తును ప్రారంభించారు. ఈ నేపథ్యంలోనే ఊహించని పరిణామం చోటుచేసుకుంది. కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉదయ కృష్ణారెడ్డి నిన్న మోతీనగర్‌లోని తన బంధువుల ఇంటికి వెళ్లాడు. ఇవాళ ఉదయం విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన బంధువులు అతడిని చికిత్స నిమిత్తం ఎర్రగడ్డ లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లుగా తెలుస్తోంది.

**ఉదయం ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్..**

ఇక తనపై వచ్చిన లైంగిక ఆరోపణలపై ఉదయం సోషల్ మీడియా వేదికగా ట్రైనీ ఐపీఎస్ ఉదయ కృష్ణారెడ్డి స్పందించారు. ఈ మేరకు ఓ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ పోస్ట్‌చేశారు. తనపై వచ్చిన ఫిర్యాదులు, ప్రచారాలు పూర్తిగా అవాస్తవమని అన్నారు. చట్టంపై పూర్తి నమ్మకం ఉందని, న్యాయం తప్పక గెలుస్తుందని సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొన్నారు. నిజానిజాలు తెలుకున్న తర్వాతే వాస్తవాలను రిపోర్ట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. కర్ణాటకకు చెందిన ఓ మహిళా ట్రైనీ ఐపీఎస్‌ను వేధిస్తున్నారని ఆదివారం సాయంత్రం అత్తాపూర్ పోలీస్ స్టేషన్ లో ఉదయ కృష్ణారెడ్డిపై కేసు నమోదైన విషయం తెలిసిందే.

**మరోవైపు పోలీసుల దర్యాప్తు షురూ..**

ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిపై లైంగిక ఆరోపణల కేసులో అత్తాపూర్ పోలీసులు దర్యాప్తును ప్రారంభించారు. జాతీయ పోలీసు అకాడమీలో పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. అనంతరం నేరుగా వారు ప్రకాశం జిల్లా లోని ఉదయ్ కృష్ణారెడ్డి స్వగ్రామానికి వెళ్లారు. ఈ కేసును హైదరాబాద్ సీపీ సజ్జనర్ ప్రత్యేకంగా పర్యవేక్షిస్తుండటం గమనార్హం.

**ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి సస్పెన్షన్**

లైంగిక ఆరోపణల నేపథ్యంలో ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిపై హైదరాబాద్ నేషనల్ అకాడమీ చర్యలు తీసుకుంది. కృష్ణారెడ్డిని తాత్కాలికంగా సస్పెండ్ చూస్తూ నిర్ణయం తీసుకుంది.

నేషనల్ పోలీస్ అకాడమీ ప్రివిలేజ్ కమిటీ నిర్ణయం మేరకు ఉదయ్ కృష్ణా రెడ్డిని ఎన్‌పీఏ నుంచి అధికారులు పంపించేశారు. తనపై ఉదయ్ కృష్ణారెడ్డి ప్రవర్తన గురించి మొదట ఎన్‌పీఏ అధికారులకు మహిళా ట్రైనీ ఐపీఎస్ ఫిర్యాదు చేశారు. సీసీటీవీ కెమెరాల ఆధారాలతో పాటు అన్ని ఎవిడెన్స్ సేకరించాక ఉదయ్ కృష్ణారెడ్డిపై ఆరోపణలు నిజమేనని ప్రివిలేజ్ కమిటీ నిర్ధారించింది. దీంతో తక్షణమే ఎన్‌పీఏ నుంచి సస్పెండ్ చేస్తూ ప్రివిలేజ్ కమిటీ నిర్ణయం తీసుకుంది. సర్వీస్‌లో జాయినింగ్‌కు సంబంధించి డీవోపీటీ దే తుది నిర్ణయం అని నేషనల్ పోలీస్ అకాడమీ అధికారులు చెబుతున్నారు.

# వృద్ధాప్య సమస్యలతో వృద్ధుడు ఆత్మహత్య



**చిట్యాల,ఫ్లాష్ ఇండియా :** వృద్ధాప్య సమస్యలు, అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నీలా పాండురయ్య (70) కొంతకాలంగా వృద్ధాప్య సంబంధిత సమస్యలు, అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం తన నివాసంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి పెద్ద కుమారుడు నీలా వెంకటరావు ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ ఎం.రవికుమార్ తెలిపారు.

# జాతీయ స్థాయిలో మెరిసిన తెలంగాణ..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మాతా-శిశు ఆరోగ్య సంరక్షణలో తెలంగాణ రాష్ట్రం జాతీయస్థాయిలో అత్యుత్తమ గుర్తింపు సాధించింది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కనబరిచిన అద్భుతమైన పనితీరును మెచ్చిన కేంద్ర ప్రభుత్వం, అందుకు ప్రోత్సాహకంగా రూ. 200 కోట్ల అదనపు నిధులను మంజూరు చేసింది. ఈ మేరకు హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో వివరాలను వెల్లడించారు. కేంద్రం నుంచి అందిన ఈ అదనపు నిధులను రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మాతా-శిశు ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు, వైద్య మౌలిక వసతుల విస్తరణకు పూర్తిగా వినియోగించనున్నట్లు ఆమె స్పష్టం చేశారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రభుత్వ ఆసుపత్రుల్లో నవజాత శిశు సంరక్షణ విభాగాలను విస్తరించనున్నారు. అలాగే ప్రసవ గదులు (లేబర్ రూములు), ఆపరేషన్ థియేటర్లను జాతీయ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా అత్యాధునికంగా తీర్చిదిద్దనున్నారు. వీటితో పాటు మిడ్‌వైఫరీ-లెడ్ కేర్ యూనిట్లు, కంగారూ మదర్ కేర్ వార్డులు, లాక్టేషన్ మేనేజ్‌మెంట్ యూనిట్లను విస్తృతంగా ఏర్పాటు చేయనున్నారు. ముఖ్యంగా అధిక ప్రసవాలు జరిగే ఏరియా ఆసుపత్రుల్లో తల్లి, గర్భస్థ శిశువు ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించేందుకు అత్యాధునిక వైద్య పరికరాలతో కూడిన ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థలను అందుబాటులోకి తీసుకురానున్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య సంస్థలను ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్‌కు అనుగుణంగా అభివృద్ధి పరిచి, నేషనల్ క్వాలిటీ అష్యూరన్స్ సర్టిఫికేషన్ పొందేలా మౌలిక వసతులను కల్పించనున్నారు. ఈ నిధుల సహాయంతో చేపట్టే ఉచిత వైద్య సేవలు, ఆధునికీకరణ పనులు రాష్ట్రంలో మాతృ మరణాలు, నవజాత శిశు మరణాల రేటును మరింతగా తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయని డాక్టర్ సంగీత సత్యనారాయణ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ దవాఖానాల్లో చేరే ప్రతి గర్భిణీకి, పుట్టిన బిడ్డకు అత్యుత్తమ వైద్యం ఉచితంగా అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఈ ప్రోత్సాహం వైద్య సిబ్బందిలో మరింత ఉత్సాహాన్ని నింపుతుందని, రాష్ట్రంలో ప్రజారోగ్య రంగాన్ని జాతీయ ప్రమాణాలకు చేర్చడంలో ఇది ఎంతో దోహదపడుతుందని కమిషనర్ వివరించారు.

# బినామీ పేరుతో వీఆర్ఏ విధులా?

**కారేపల్లి,ఫ్లాష్ ఇండియా :** మండల తహసీల్దార్ కార్యాలయంలో బినామీ పేరుతో వీఆర్ఏగా విధులు నిర్వహిస్తున్నారని ఆరోపిస్తూ కల్లోజి శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని మల్లయ్యగూడెం గ్రామంతో పాటు రెండు గ్రామ పంచాయతీలకు చెందిన రైతులు సోమవారం ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రంలో రైతులు పేర్కొన్న వివరాల ప్రకారం.. రెవెన్యూ సంబంధిత పనుల్లో రైతులను ఇబ్బందులకు గురిచేస్తూ, బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ నిర్వహించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ కృష్ణయ్యను కోరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు నిరసన చేపట్టి నినాదాలు చేశారు. ఫిర్యాదు వచ్చిన తర్వాతే అధికారులు స్పందించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ఈ వ్యవహారాన్ని ఉన్నతాధికారులు విచారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాలోత్ కిషోర్, గుజ్జర్లపూడి సైదులు, పాటి రమేష్, పాటి రంగయ్య, మాలోత్ స్వామి, పోతుల సత్యమయ్య, పోతుల వెంకటేశ్వర్లు, బానోత్ భాషా, కొండం వెంకటేశ్వర్లు, పాటి రామయ్య తదితర రైతులు పాల్గొన్నారు.






ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా
మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# దద్దరిల్లిన రాజ్యసభ

**న్యూ ఢిల్లీ :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే రాజధాని ఢిల్లీ లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నీట్ ప్రవేశ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలు, విద్యావ్యవస్థలోని అక్రమాలకు నిరసనగా, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన 'చలో సంసద్' నిరసన మార్చ్ తీవ్ర ఘర్షణకు దారితీసింది. అయితే, వారు చేపట్టిన ర్యాలీకి పర్మిషన్ లేదని పోలీసులు అడ్డుకోవడంతో జంతర్ మంతర్ వద్ద భారీగా చేరుకున్న నిరసనకారులు, సీజేపీ మద్దతుదారులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పరిస్థితి చేయి దాటిపోవడంతో అల్లర్లను అదుపు చేసేందుకు పోలీసులు లాఠీఛార్జ్ జరిపారు.

**రాజ్యసభలో గందరగోళం..**

అయితే, కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళనపై రాజ్యసభలో గందరగోళం నెలకొంది. సీజేపీ చేపట్టిన ఆందోళనలను కేంద్ర ప్రభుత్వం బలగాలతో అణచివేయాలని చూస్తోందన్న ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే తీవ్ర ఆరోపణలు చేశారు. విద్యార్థుల పక్షాన సభలో నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ, సీబీఎస్ఈలో తప్పిదాలపై తమను మాట్లాడేందుకు మాట్లాడేందుకు అవకాశం కల్పించాలని కోరారు. అయితే, చైర్మన్ సీపీ రాధాకృష్ణ అందుకు అనుమతినివ్వకపోవడంతో ఇండియా కూటమి సభ్యులు రాజ్యసభలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడం ప్రారంభించారు. స్పీకర్ వారించినా.. వినకపోవడంతో ఎట్టకేలకు సభను మధ్యాహ్నం వరకు వాయిదా వేశారు.

**మోడీ ప్రభుత్వానికి దమ్ము లేదు: ఖర్గే**

కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వంపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే తీవ్ర-స్థాయిలో విరుచుకుపడ్డారు. పార్లమెంట్ ముట్టడికి యత్నించిన సీజేపీ విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. విద్యార్థులపై జరిగిన ఈ దాడి కేవలం వారిపై జరిగింది కాదని, నిలువెత్తు ప్రజాస్వామ్యంపై జరిగిన దాడేనని ఆయన మండిపడ్డారు. అయోధ్య రాముడి మందిరానికి సంబంధించిన విరాళాల చోరీ అంశంపై పార్లమెంట్లో తాము స్పష్టమైన ప్రశ్నలు లేవనెత్తామని ఖర్గే తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అయోధ్య ట్రస్టు ఏర్పాటు చేసినప్పుడు అందులో ప్రధాని మోడీ కూడా భాగస్వామిగా ఉన్నారని, ట్రస్ట్ స్థాపకుల్లో ఆయన ఒకరని గుర్తుచేశారు. కోట్లాది మంది భక్తులు ఎంతో నమ్మకంతో సమర్పించిన విరాళాలు చోరీకి గురవ్వడం తీవ్రమైన విషయమేని, ఈ చోరీ ఘటనకు ప్రధాని మోడీ బాధ్యత వహించాలని ఖర్గే డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను, అక్రమాలను ప్రశ్నిస్తున్న విద్యార్థులపై, ప్రతిపక్షాలపై బలప్రయోగానికి దిగడం సరికాదని ఆయన హితవు పలికారు. మోడీ ప్రభుత్వానికి దమ్ము లేదని.. ప్రభుత్వంలో కూర్చునే అర్హత కోల్పోయారని అన్నారు.



# శ్రీ హరిచంద్ర శవదహన కార్మిక సొసైటీ నూతన కమిటీ ఎన్నిక

**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** శ్రీ హరిచంద్ర శవ దహన బారెల్ కార్మిక సొసైటీ మిర్యాలగూడ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకోవడం జరిగింది. మిర్యాలగూడ పట్టణంలోని గాంధీ నగర్ లో జరిగినటువంటి ఎన్నికల్లో అధ్యక్షులుగా ఉబ్బపల్లి నాగరాజు(నంద)ని ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి గౌరవ అధ్యక్షులుగా ఉమ్మడి గాంధీనగర్ కౌన్సిలర్ దైద సోమసుందర్,మధుసూదన్ ల సమక్షంలో ఎన్నుకోవడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ఐదు భాగాల ప్రజలు పాల్గొని ఉబ్బపల్లి నాగరాజు ని పట్టణ అధ్యక్షులుగా ప్రకటించారు. ఉపాధ్యక్షులు గా దైద ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా దైద నాగేష్,కోశాధికారిగా ఉబ్బపల్లి సైదులు,సహాయ కార్యదర్శిగా ఉబ్బపల్లి ప్రతాప్ లను ఎన్నుకోవడం జరిగింది.

# పట్టణ పేదలకు తీపి కబురు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** క్యూర్ పరిధిలో ఫ్లాట్ల కోసం రేపటి నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. మీ సేవ, వాట్సాప్, వెబ్సైట్లో వీటికోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. రూ.10వేల టోకెన్ చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. డ్రా పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని స్పష్టం చేశారు. డ్రాలో ఇల్లు రానివారి డబ్బులు వెంటనే చెల్లిస్తామని వెల్లడించారు. ఆయా ఫ్లాట్లు పదేళ్ల పాటు అమ్మరాదని.. అద్దెకు ఇవ్వరాదని షరతును విధిస్తామని అన్నారు. కుటుంబంలో ఒకరికి ఇళ్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

**వారికి తొలివిడతలో ప్రాధాన్యం కల్పిస్తాం..**

క్యూర్ పరిధిలో ఇల్లు, స్థలం లేనివారికి తొలివిడతలో ప్రాధాన్యం కల్పిస్తామని మంత్రి చెప్పుకొచ్చారు. లబ్ధిదారుల పేరిట స్థలం రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. స్థలంతో పాటు రూ.5లక్షల సబ్సిడీ అందజేస్తామని పేర్కొన్నారు. ఈరోజు (సోమవారం) ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన వాట్సాప్ దరఖాస్తులు, LIG ఇళ్ల బ్రోచర్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడారు.

**రూ.5లక్షల సహాయం అందజేస్తాం..**

వారికి స్థలం ఇవ్వడంతో పాటు రూ.5లక్షల సహాయం అందజేస్తామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. పదేళ్ల వరకు ఇళ్లు అమ్ముకునే అవకాశం లేదని చెప్పుకొచ్చారు. క్యూర్ లో మొదటి దశలో 16నియోజకవర్గాల్లో ఇస్తున్నామని.. త్వ-రలోనే మిగిలిన నియోజకవర్గాల్లో కూడా ఇళ్లు ఇస్తామని స్పష్టం చేశారు. ఆయా పార్టీలు, రాజకీయాలకు సంబంధం లేకుండా ఇళ్లను కేటాయిస్తామనిపేర్కొన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల ఇందిరమ్మ ఇళ్లు పూర్తి అవుతున్నాయని ఇప్పటికే రెండు విడతల్లో ఏడు లక్షల ఇళ్లు మంజూరు చేశామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు సొంత స్థలాలు ఉన్న వారికి ఇందిరమ్మ ఇళ్లు అందజేశామని వెల్లడించారు.

**ఇంటి స్థలంలేని పేదల కల నెరవేరుస్తాం..**

ఇంటి స్థలంలేని పేదలకు కూడా వీటిని అందజేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి పొంగులేటి వివరించారు. లాభం, స్వార్థం లేకుండా పేదలకు ఇళ్లు నిర్మించి అందజేస్తున్నామని పేర్కొన్నారు. క్యూర్ పరిధిలో ఇళ్లు కట్టించే పథకాన్ని ఈ రోజు ప్రారంభించామని తెలిపారు. ఇందుకోసం పదహారు నియోజకవర్గాల్లో స్థలాలు ఎంపిక చేశామని చెప్పుకొచ్చారు. 528 అడుగుల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఫ్లాట్లను నిర్మిస్తున్నామని వెల్లడించారు. కేసీఆర్ హయాంలో తప్పిదాలతో అప్పుడు కట్టిన ఫ్లాట్లు ఉపయోగపడకుండా పోయాయని చెప్పారు. నగరానికి దూరంగా 35 కిలోమీటర్ల దూరంలో కట్టడంతో పేదలు అక్కడకు వెళ్లలేదని తెలిపారు.

**పేదలకు ఇళ్లు ఇస్తామంటే కొందరు హేళన చేశారు..**

చదరపు గజానికి లక్షల విలువ ఉండే కోర్ ప్రాంతంలో టవర్లు నిర్మించి పేదలకు ఇస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. పేదలకు ఇళ్లు ఇస్తామంటే కొందరు హేళన చేశారని అన్నారు. ఈ పథకం ఫెయిల్ అయితే విమర్శించాలని కొందరు సంతోషపడ్డారని చెప్పుకొచ్చారు. రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పేదలకు ఇంటి కల నెరవేర్చాలని తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కూడా ఇలా ఇళ్లు కట్టించి ఇవ్వడం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

**పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు: మంత్రి శ్రీధర్ బాబు**

గుడిసెలు లేని తెలంగాణ రాష్ట్రం తమ ప్రభుత్వం లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. ఆ లక్ష్యంతోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. నాలుగు దశాబ్దాల క్రితమే కాంగ్రెస్ ప్రభుత్వం LIG ఇళ్లను నిర్మించిందని తెలిపారు. నగరంలో చాలాచోట్ల హౌసింగ్ బోర్డు కాలనీలు ఉన్నాయని ప్రస్తావించారు. ఎంత విలువైన భూమి అయినా పేదలకు ఇవ్వాలని తాము నిర్ణయించామని చెప్పుకొచ్చారు. పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు జరుగుతోందని స్పష్టం చేశారు. ఇళ్ల కేటాయింపుల్లో రిజర్వేషన్లు అమలు చేస్తామని తెలిపారు. మొదటి విడతలో 16నియోజకవర్గాల్లో 7680 ఫ్లాట్లను నిర్మిస్తామని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

**హౌసింగ్ విభాగాన్ని పునరుద్ధరించాం: మంత్రి పొన్నం ప్రభాకర్**

క్యూర్ పరిధిలోని ప్రజలకు మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్లో స్థలం లేని పేదలు కిరాయి ఇళ్లలో ఉంటున్నారని తెలిపారు. క్యూర్ లో పేదలకు తమ ప్రభుత్వమే స్థలం ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకునే పథకాన్ని ప్రారంభించామని వెల్లడించారు. గత ప్రభుత్వం హౌసింగ్ విభాగాన్నే రద్దు చేసిందని చెప్పుకొచ్చారు. తాము దాన్ని పునరుద్ధరించామని అన్నారు. బల్కంపేట ఎల్లమ్మ బోనాల ముందు క్యూర్ లో ఈ పథకం ప్రారంభించామని వెల్లడించారు. మళ్లీ వచ్చే బోనాల నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని టార్గెట్గా పెట్టుకున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలి

## ఎల్-వినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలి -సమీక్షా సమావేశంలో మంత్రులు




**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** నల్గొండ కలెక్టరేట్లోని ఉదయాదిత్య భవనంలో తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో సోమవారం"ఎల్-వినో ప్రభావాన్ని ఎదుర్కొనే సంసిద్ధత, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం మరియు సంబంధిత అంశాలపై" నల్గొండ,సూర్యాపేట,యాదాద్రి భువనగిరి జిల్లాల అధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఇరిగేషన్ మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,నల్గొండ జిల్లా ఇంచార్జ్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ హాజరై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఎల్-వినో ప్రభావం వల్ల ఏర్పడే వాతావరణ మా-ర్పులను దృష్టిలో ఉంచుకుని రైతులకు అనుకూలమైన ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించడం,సాగునీటి నిర్వహణ,నీటి వనరుల సమర్థ వినియోగం, వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందించడం,అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ముందస్తు కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలనిలి మంత్రులు అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి,ఉమ్మడి నల్గొండ జిల్లా ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు,నల్గొండ,సూర్యాపేట,య దాద్రి భువనగిరి జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చేపడుతున్న ముందస్తు చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

# ఎస్ఎఫ్ఐ 24 గంటల దీక్ష భగ్నం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తలపెట్టిన 24 గంటల నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేశారు. విద్యా వ్యవస్థలో నెలకొన్న సంక్షోభం, ఎన్టీఏ వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న విద్యార్థి ఉద్యమాలకు సంఘీభావంగా నిర్వహించిన ఈ దీక్షను సీపీఎం నాయకులు జాన్ వెస్లీ, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రారంభించారు. అయితే, ఈ నిరసనను పోలీసులు అడ్డుకోని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. రజనీకాంత్, రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు, ఉపాధ్యక్షులు ఎం. మమత, డి. కిరణ్, కె. అశోక్ రెడ్డి సహా పలువురు నేతలను అరెస్టు చేసి ముషీరాబాద్ పోలీస్ స్టేషన్కు తరలించారు. శాంతియుత దీక్షపై పోలీసుల చర్యను ప్రజాస్వామ్య హక్కులపై దాడిగా అభివర్ణించిన విద్యార్థి నేతలు, విద్యారంగ పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# రైతులకు యూరియా లేదు..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ భవన్ లో జరిగిన బీఆర్ఎస్ సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డిపై తీవ్ర-స్థాయిలో విమర్శలు గుప్పించారు. బాన్సువాడలో మరోసారి గులాబీ జెండా ఎగరేసే సమయం వచ్చిందని ఆయన అన్నారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి బీఆర్ఎస్ తరపున గెలిచి పార్టీ మారారని, ప్రస్తుతం కాంగ్రెస్ పరిస్థితి కూడా బాగోలేదని ఆయనకు అర్థమైందన్నారు. "కుడితిలో పడిన ఎలుకలా పోచారం పరిస్థితి తయారైంది. ఇకపై ఏ ఎన్నికలు వచ్చినా ఆయన ఓడిపోవడం ఖాయం" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. "ఈ గొంతులో ప్రాణం ఉన్నంత వరకు పార్టీ మారను" అని చెప్పిన పోచారం చివరకు మాట తప్పి పార్టీ మారారని ఆరోపించారు. స్పీకర్గా పనిచేసిన వ్యక్తి ఇప్పుడు తాను ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకునే పరిస్థితి కూడా లేదని ఎద్దేవా చేశారు. పోచారం తన రాజకీయ భవిష్యత్తును తానే సమాధి చేసుకున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డిపై కూడా కేటీఆర్ మండిపడ్డారు. ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చి ఇప్పుడు వాటిని అమలు చేయకుండా చేతులెత్తేశారని ఆరోపించారు. దేవుళ్లపై ఒట్టు పెట్టి కూడా అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. ఏ సభ పెట్టినా కేసీఆర్ను విమర్శించడమే సీఎం పనిగా మారిందన్నారు. రాష్ట్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేటీఆర్ అన్నారు. యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని, షాపుల్లో ఎరువుల సంచులు లేకపోతే యాప్లో కనిపించినా ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. ఢిల్లీకి పంపేందుకు సంచులు ఉంటున్నాయని, కానీ రైతులకు మాత్రం అందడం లేదని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కూడా కేటీఆర్ స్పందించారు. రెండు పిల్లర్లు కుంగి 31 నెలలు అవుతున్నా ఇప్పటి వరకు మరమ్మతులు ఎందుకు చేపట్టలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కన్నెపల్లి నుంచి ప్రతిరోజూ నీరు కిందకు వెళ్తున్నా పంపింగ్ చేయడం లేదన్నారు. రిజర్వాయర్లు డెడ్ స్టోరేజ్కు వెళ్తే ప్రభుత్వం మాత్రం "కోల్డ్ స్టోరేజ్"లోకి వెళ్లిపోయిందని ఎద్దేవా చేశారు. తెలంగాణ కోసం అవసరమైతే రక్తమే కాదు ప్రాణాలు కూడా ఇస్తామని బీఆర్ఎస్ ఎప్పుడూ చెప్పిందని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ హయాంలో ఇచ్చిన ఉద్యోగాలను కూడా ప్రస్తుత ప్రభుత్వం తమ ఘనతగా చెప్పుకుంటోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

**ఎవరైనా తెలిసి తెలిసి మునిగే పడవను ఎక్కుతాడా?..**

బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి పార్టీ మా-రబోతున్నారనే ప్రచారం జోరుగా వినిపిస్తోంది. గత కొంత కాలంగా గులాబీ పార్టీకి అంటి ముట్టనట్లుగా వ్యవహరిస్తున్న మల్లారెడ్డి కండువా మార్చేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారని శ్రావ-ణమాసంలో ఆయన కారుదిగడం ఖాయం అనే చర్చ రాష్ట్ర రాజకీయాల్లో బలంగా వినిపిస్తోంది. అయితే మల్లారెడ్డి బీజేపీలో చేరబోతున్నారని కొందరు, కాంగ్రెస్ లో చేరుతారని మరికొందరు అంచనాలు వే-స్తున్న వేళ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని రేపుతున్నాయి. ఇవాళతెలంగాణ భవన్ లో పలువురు బాన్సువాడ నియోజకవర్గం నేతలు బీఆర్ఎస్ లోకి చేరారు. ఈ సందర్భంగా మాట్లాడిన కేటీఆర్ గతంలో బీఆర్ఎస్ తరపున ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్కు దగ్గరైన పోచారం శ్రీనివాస్ రెడ్డిని ఉద్దేశించి హాట్ కామెంట్స్ చేశారు. గాచారం బాగోలేకే పోచారం కాంగ్రెస్ పార్టీలో చేరారని, ఎవరైనా తెలిసి తెలిసి మునిగే పడవను ఎక్కుతారా?. ఊడిపోయే కాంగ్రెస్లో చేరి.. నేను కాంగ్రెస్లోనే పుట్టినా అని డైలాగులు కొట్టి ఇప్పుడు కుడితిలో పడ్డ ఎలుక మాదిరిగి గిలగిలా కొట్టుకుంటున్నాడని అన్నారు. స్పీకర్ గా పని చేసిన పెద్ద మనిషి ఇప్పుడు తానే పార్టీలో ఉన్నానో చెప్పుకోలేని పరిస్థితి దాపురించిందన్నారు.

**రేవంత్ రెడ్డికి ఆ రెండే వచ్చు:**

ఎలక్షన్ ఎప్పుడు వచ్చినా పోచారం శ్రీనివాస్ రెడ్డిని ఓడించడం, కాంగ్రెస్ను బొంద పెట్టడమే లక్ష్యంగా పని చేద్దామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పోచారం శ్రీనివాస్ తెలంగాణ తిరుమల యాదగిరిగుట్ట సాక్షిగా మాట ఇచ్చి తప్పాడని, ప్రాణం ఉన్నంత వరకు కేసీఆర్ తోనే ఉంటానని దేవుడి మీద ఒట్టేసి చెప్పిన పోచారం మాట తప్పాడని అన్నారు. రేవంత్ రెడ్డి ఒక్కరే దేవుడి మీద ఓట్లు పెట్టి మాట తప్పుతాడనుకున్నాం. కానీ పోచారం కూడా అదే దారి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తిట్లు, ఒట్లు ఈ రెండే వచ్చని ఈ రెండున్నరేళ్ల కాలంలో ఆయనేం చేశారో ఓ నాలుగు పనులు చెప్పగలడా అని ప్రశ్నించారు. ఊరికో దేవుడి మీద ఒట్టు పెట్టింది చాలదన్నట్లు మళ్లీ భద్రాచలం రాముడి మీద ఆనా అని ఒట్టు పెడుతున్నాడు. ఇప్పటి వరకు పెట్టిన ఒట్లు సరిపోవా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటుతుంటే చేతలు గడపదాడటం లేదన్నారు. షాప్‌లలో లేని యూరియా యాప్లో ఎక్కడి నుంచి వస్తుందని ప్రశ్నించారు. ఎన్నికలకు ఆరునెలల ముందు ఏదైనా కల్లిబొల్లి మాటలు చెబితే ప్రజలు మళ్లీ మాకే ఓటు వేస్తారనే భ్రమల్లో కాంగ్రెస్ నేతలు ఉన్నారని కాంగ్రెస్ మాటలు నమ్మే పరిస్థితి మళ్లీ లేదన్నారు.

**రిజర్వాయర్లు డెడ్ స్టోరేజీకి.. ప్రభుత్వం కోల్డ్ స్టోరేజీలో:**

రాష్ట్రంలో రిజర్వాయర్లన్నీ డెడ్ స్టోరేజీకి వెళ్తే ప్రభుత్వం కోల్డ్ స్టోరేజ్ లో ఉందని విమర్శించారు. ఎల్ నినో రాబోతోందని ఆర్నెళ్ల క్రితమే శాస్త్రవేత్తలు అప్రమత్తం చేస్తే కరువు పరిస్థితులపై ముఖ్యమంత్రి ఇప్పుడు మీటింగ్ పెట్టారని ఇన్నాళ్లు నిద్రపోయారా అని ప్రశ్నించారు. ఆలోచన, ప్రణాళిక లేదని విమర్శించారు.

# ఇరుకైన రోడ్లతో ట్రాఫిక్ తిప్పలు

**ఖానాపూర్,ఫ్లాష్ ఇండియా :** నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపాలిటీగా 2018 లో ఏర్పడి 8 ఏళ్లు గడుస్తున్నా ఖానాపూర్ పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇరుకైన రోడ్లు, ఆగిపోయిన పనులు, పెరుగుతున్న ప్రమాదాల పై సోమవారం పట్టణ యువకులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణిలో వినతిపత్రం అందచేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సాయిబాబా మందిరం నుంచి పోలీస్ స్టేషన్ వరకు రోడ్డు విస్తరణ, డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనుల కోసం నిధులు మంజూరు చేసింది. కానీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు నత్తనడకన సాగాయి. సాయిబాబా మందిరం నుంచి జూనియర్ కాలేజ్ వరకు మాత్రమే కొంత పని జరగగా, జూనియర్ కాలేజ్ నుంచి తెలంగాణ చౌరస్తా మీదుగా పోలీస్ స్టేషన్ వరకు విస్తరణ, డివైడర్, లైటింగ్ పనులు పూర్తిగా ఆగిపోయాయి. ఎన్నికల ముందు బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు అధికారంలోకి వచ్చిన వెంటనే పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కానీ ప్రభుత్వం మారినా పరిస్థితిలో మార్పు లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**రోజూ ప్రమాదాలు.. ట్రాఫిక్ జామ్..**

ఖానాపూర్ మీదుగా మంచిర్యాల, జగిత్యాల, కరీంనగర్, నిర్మల్ జిల్లాలకు నిత్యం భారీ వాహనాలు వెళ్తుంటాయి. తెలంగాణ చౌర-స్తా నుంచి కాలేజ్ వరకు రోడ్డు ఇరుకుగా ఉండటంతో రోజూ ట్రాఫిక్ జామ్, చిన్న చిన్న ప్రమాదాలు జరుగుతునేవున్నాయి . రోడ్డు మధ్యలో ఉన్న సెంటర్ లైటింగ్ స్తంభాల కారణంగా ఇటీవల ఒక ప్రజాప్రతినిధి కారును ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. భారీ వాహనం స్తంభాన్ని ఢీ కొట్టడంతో పట్టణంలో విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోయిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఇరుకైన రోడ్లపైనే చిరువ్యాపారులు వ్యాపారం చేయడం, రోడ్డు పక్కన వాహనాలు పార్కింగ్ చేయడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణ చౌరస్తా, వివేకానంద చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తాల వద్ద ప్రతిరోజూ ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు.

**ప్రజావాణి కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు..**

ఈ నేపథ్యంలో ఖానాపూర్ పట్టణ యు-వకులు రాపెల్లి రాజు యాదవ్, కోరెండ్ల



సుధీర్, గాంధారి నరేంద్రనాథ్, సుర శ్రీనివాస్, ముజీబ్ తదితర యువకులు సోమవారం ప్రజావాణి జిల్లా కలెక్టర్ వినతిపత్రం అందజేశారు. రోడ్డు విస్తరణకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాల తొలగింపునకు నిధులు విడుదల చేసి, పనులను వేగవంతం చేయాలని వారు కోరారు. ప్రభుత్వం స్పందించాలి, ఆగిపోయిన రోడ్డు విస్తరణ, డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనుల కోసం వెంటనే నిధులు మంజూరు చేసి పట్టణాన్ని అభివృద్ధి చేయాలని వారు కోరారు.

## సంపాదకీయం




# కాలుష్య కాటు!

గాలి కనిపించదు. నీరు మాట్లాడదు. నేల నిరసన వ్యక్తం చేయదు. కానీ ఇవే మూడు కలుషితమైతే సమాజం మూలాలే కదిలిపోతాయి. ప్రస్తుతం తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా ఎదు-రవుతున్న అతిపెద్ద సవాళ్లలో కాలుష్యం ఒకటి. ఒకప్పుడు పర్యావరణ సమస్యగా మాత్రమే కనిపించిన కాలుష్యం, ఇప్పుడు ప్రజారోగ్యం, వ్యవసాయం, ఆర్థిక వ్యవస్థ, పట్టణ ప్రణాళిక, రాజకీయ పాలన ఇలా ప్రతి రంగాన్ని ప్రభావితం చేస్తున్న జాతీయ సంక్షోభంగా మారింది. అభివృద్ధి పేరుతో ప్రకృతిని నిర్లక్ష్యం చేసిన ఫలితం ఇప్పుడు ప్రజల ఊపిరిపై, తాగునీటిపై, ఆహార భద్రతపై, భవిష్యత్ తరాల ఆరోగ్యంపై పడుతోంది. అభివృద్ధి అవసరం. పరిశ్రమలు రావాలి. నగరాలు విస్తరించాలి. రహదారులు, నిర్మాణాలు పెరగాలి. కానీ ప్రకృతిని ధ్వంసం చేసి సాధించే అభివృద్ధి చివరకు సమాజానికే భారంగా మారుతుంది. ఇదే పరిస్థితి నేడు మన కళ్లముందు కనిపిస్తోంది. ఒకవైపు పారిశ్రామికీకరణ వేగంగా సాగుతుంటే, మ-రోవైపు గాలి, నీరు, నేల నాణ్యత క్షీణిస్తోంది. ప్రజలు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ఊపిరితిత్తుల వ్యాధులు, గుండె సంబంధిత సమస్యలు, క్యాన్సర్, చర్మవ్యాధులు, అలెర్జీలు పెరుగుతున్నాయి. కాలుష్యం కేవలం పర్యావరణ సమస్య మాత్రమే కాదు; అది ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిగా మారుతోంది. పట్టణాల్లో వాహనాల సంఖ్య విపరీతంగా పెరగడం గాలి కాలుష్యానికి ప్రధాన కారణంగా నిలుస్తోంది. ప్రతి ఏడాది లక్షల సంఖ్యలో కొత్త వాహనాలు రోడ్లపైకి వస్తున్నాయి. కానీ వాటికి అనుగుణంగా ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రభుత్వాలు వెనుకబడుతున్నాయి. ట్రాఫిక్ జామ్‌లు, డీజిల్ వాహనాల పొగ, నిర్మాణ ప్రాంతాల్లో ఎగిసే ధూళి, పరిశ్రమల నుంచి విడుదలయ్యే విషవాయువులు కలిసి నగరాల గాలిని ప్రమాదకరంగా మారుస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన ప్రమాణాలతో పోలిస్తే అనేక భారతీయ నగరాల్లో గాలి నాణ్యత చాలా దిగజారింది. ఈ పరిస్థితిలో పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారే ముందుగా ప్రభావితమవుతున్నారు. నీటి కాలుష్యం మరో తీవ్రమైన సమస్య. ఒకప్పుడు గ్రామాలకు జీవనాడిగా ఉన్న చెరువులు, వాగులు, నదులు ఇప్పుడు మురుగు కాల్వలుగా మారుతున్నాయి. శుద్ధి చేయని పారిశ్రామిక వ్యర్థాలు, మున్సిపల్ మురుగునీరు, ప్లాస్టిక్ వ్యర్థాలు నదుల్లో కలవడం వల్ల తాగునీటి వనరులు కలుషితమవుతున్నాయి. భూగర్భ జలాలు కూడా రసాయన కాలుష్యానికి గురవుతున్నాయి. ఫ్లోరైడ్, నైట్రేట్, భారీ లోహాల మోతాదు పెరగడం అనేక ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోంది. ఒకవైపు తాగునీటి కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వాలు, మరోవైపు నీటి వనరులను కలుషితం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడంలో మాత్రం విఫలమవుతున్నాయి. వ్యవసాయ రంగం కూడా కాలుష్య ప్రభావం నుంచి తప్పించుకోలేకపోతోంది. ర-సాయన ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగం నేల సారాన్ని తగ్గిస్తోంది. నేలలోని సూక్ష్మజీవ వ్యవస్థ దెబ్బతింటోంది. దీర్ఘకాలంలో దిగుబడులు తగ్గే ప్రమాదం పెరుగుతోంది. కలుషిత నీటితో సాగు చేయడం వల్ల ఆహార పదార్థాల్లో కూడా విషపదార్థాల అవశేషాలు పెరుగుతున్నాయి. అంటే కాలుష్యం పర్యావరణాన్నే కాదు, మనం తినే ఆహారాన్నీ ప్రభావితం చేస్తోంది. ప్లాస్టిక్ కాలుష్యం నేడు ప్రత్యేక ఆందోళన కలిగించే అంశం. ఒకసారి వినియోగించి పడేసే ప్లాస్టిక్ సంచులు, బాటిళ్లు, కప్పులు, ప్యాకేజింగ్ వ్యర్థాలు గ్రామాల నుంచి మహానగరాల వరకు పేరుకుపోతున్నాయి. అవి మట్టిలో కలవడానికి వందల సంవత్సరాలు పడుతుంది. ప్లాస్టిక్ వ్యర్థాలు కాలువలను మూసేస్తాయి. వర్షాకాలంలో వరదలకు కారణవ-ంవుతాయి. పశువులు వాటిని తిని మరణిస్తున్నాయి. సముద్రాల్లో చేరి జలచరాలను నాశనం చేస్తున్నాయి. ఇటీవల సూక్ష్మ ప్లాస్టిక్ కణాలు తాగునీటిలో, సముద్ర ఆహారంలో, అంతేకాదు మన శరీరంలో కూడా గుర్తించబడుతున్నాయంటే సమస్య తీవ్రత ఎంతుందో అర్థం చేసుకోవచ్చు. పర్యావరణ పరిరక్షణకు చట్టాలు లేవని కాదు. కాలుష్య నియంత్రణ మండళ్లు ఉన్నాయి. పర్యావరణ అనుమతుల వ్యవస్థ ఉంది. గ్రీన్ ట్రైబ్యునల్ ఉంది. కానీ అమలులో మాత్రం లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అనేక పరిశ్రమలు నిబంధనలు ఉల్లంఘించినా చర్యలు ఆలస్యమవుతున్నాయి. కొన్ని సందర్భాల్లో రాజకీయ ఒత్తిళ్లు, అధికార యంత్రాంగం నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపాలు సమస్యను మరింత తీవ్రం చేస్తున్నాయి. కాలుష్యం సృష్టించిన తర్వాత జరిమానా విధించడం కంటే, ముందుగానే నివారించడం ప్రభుత్వాల ప్రధాన లక్ష్యంగా ఉ ండాలి. కాలుష్య నియంత్రణలో స్థానిక సంస్థల పాత్ర కూడా కీలకం. మున్సిపాలిటీలు, పంచాయతీలు ఘన వ్యర్థాల నిర్వహణను శాస్త్రీయంగా చేపట్టాలి. ఇంటింటా చెత్త వేరు చేయడం, తడి-పొడి వ్యర్థాల శుద్ధి, కంపోస్టింగ్ కేంద్రాలు, రీసైక్లింగ్ వ్యవస్థలను సమర్థంగా అమలు చేయాలి. కానీ చాలా చోట్ల చెత్త నిర్వహణ ఇప్పటికీ అసంఘటితంగానే ఉంది. చెత్తను బహిరంగంగా కాల్చడం వల్ల గాలి కాలుష్యం మరింత పెరుగుతోంది. ప్రజల బాధ్యత కూడా అంతే ముఖ్యం. ప్రభుత్వం ఒక్కటే కాలుష్యాన్ని నియంత్రించలేదు. అవసరం లేని వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించడం, ప్రజా రవాణాను ప్రోత్సహించడం, చెట్లను నాటడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, నీటి వనరులను కలుషితం చేయకుండా చూడడం ప్రతి పౌరుడి కర్తవ్యం. పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదు; అది సామాజిక ఉద్యమంగా మారాలి. రాజకీయంగా చూస్తే పర్యావరణం ఇప్పటికీ ఎన్నికల ప్రధాన అజెండాగా మారలేదు. ఉచిత పథకాలు, రుణమాఫీలు, అభివృద్ధి హామీలపై రాజకీయ పార్టీలు విస్తృతంగా చర్చిస్తున్నప్పటికీ, స్వచ్ఛమైన గాలి, సురక్షిత తాగునీరు, కాలుష్య నియంత్రణ వంటి అంశాలకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదు. కానీ భవిష్యత్తులో ప్రజారోగ్య సమస్యలు పెరిగే కొద్దీ పర్యావరణ పరిరక్షణ కూడా రాజకీయ చర్చలో కేంద్రబిందువుగా మారడం ఖాయం. అందుకే ప్రభుత్వాలు తాత్కాలిక రాజకీయ లాభనష్టాల కంటే దీర్ఘకాలిక ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకోవాలి. ప్రస్తుతం ప్రపంచ దేశాలు వాతావరణ మార్పు, కార్బన్ ఉద్గారాల తగ్గింపు, పునరుత్పాదక ఇంధనాల వినియోగంపై దృష్టి సారిస్తున్నాయి. భారతదేశం కూడా పర్యావరణ పరిరక్షణలో అనేక అంతర్జాతీయ ఒప్పందాలకు కట్టుబడి ఉంది. అయితే కేవలం అంతర్జాతీయ వేదికలపై హామీలు ఇవ్వడం సరిపోదు. స్థానిక స్థాయిలో వాటిని కచ్చితంగా అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై కూడా ఉంది. కాలుష్యాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం బహుముఖ వ్యూహాన్ని అమలు చేయాలి. పరిశ్రమలపై కఠిన పర్యవేక్షణ, కాలుష్య ప్రమాణాల ఉల్లంఘనపై భారీ జరిమానాలు, మురుగునీటి శుద్ధి కేంద్రాల విస్తరణ, నగరాల్లో ప్రజా రవాణా బలోపేతం, విద్యుత్ వాహనాలకు ప్రోత్సాహం, పట్టణ హరిత ప్రాంతాల విస్తరణ, చెరువులు-నదుల పునరుద్ధరణ, ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేయడం వంటి చర్యలు అత్యవసరం. అదే సమయంలో పర్యావరణ విద్యను పాఠశాల స్థాయి నుంచే బలోపేతం చేయాలి. అవగాహన పెరిగితేనే చట్టాల అమలు కూడా సులభమవుతుంది. కాలుష్యం నెమ్మదిగా చంపే శత్రువు. అది ఒక్కరోజులో ప్రభావం చూపదు. కానీ కాలక్రమేణా సమాజ ఆరోగ్యాన్ని, ఆర్థిక వ్యవస్థను, ప్రకృతి సమతుల్యతను దెబ్బతీస్తుంది. అందుకే దీనిని చిన్న సమస్యగా తీసుకునే అవకాశం లేదు. అభివృద్ధి, పారిశ్రామికీకరణ, పట్టణీకరణ అన్నీ అవసరమే. అయితే అవి పర్యావరణానికి ముప్పు కలిగించకుండా, స్థిరమైన అభివృద్ధి సూత్రాలకు అనుగుణంగా సాగాలి. చివరగా ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. మనం ప్రకృతిని రక్షించడం అంటే చెట్లను, నదులను, పక్షులను మాత్రమే కాపాడటం కాదు. మన పిల్లల భవిష్యత్తును కాపాడటం. స్వచ్ఛమైన గాలిని, సురక్షితమైన నీటిని, ఆరోగ్యకరమైన ఆహారాన్ని తదుపరి తరాలకు అందించడం. కాలుష్యాన్ని నియంత్రించడం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు; ప్రతి పౌరుడి నైతిక బాధ్యత కూడా. ఈ బాధ్యతను ఎంత త్వరగా గుర్తిస్తే, అంత త్వరగా "కాలుష్య కాటు" నుంచి సమాజాన్ని రక్షించగలం.

# విధానమే రైతు నిర్ణయాన్ని మార్చాలి

తెలంగాణలో ఈ ఖరీఫ్ సీజన్ మరోసారి వ్యవసాయ రంగంలోని వాస్తవాలను ప్రభుత్వం ముందుంచింది. వ్యవసాయ శాఖ ఎంత విస్తృతంగా ఆరుతడి పంటలు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రచారం చేసినా రైతులు మాత్రం వరి, పత్తి, మొక్కజొన్న పంటలనే ఎంచుకున్నారు. దీనిని కొందరు రైతుల సంప్రదాయ ఆలోచనగా, మరికొందరు అవగాహన లోపంగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. కానీ వాస్తవానికి ఇది రైతు తీసుకున్న ఆర్థిక నిర్ణయం. వ్యవసాయంలో భావోద్వేగాలకు కాదు, భరోసాకు విలువ ఉంటుంది. ఆ భరోసా ఎక్కడ ఉంటే రైతు అక్కడికే వెళ్తాడు. అందుకే ప్రభుత్వ సూచనలను పక్కనబెట్టి, మార్కెట్ హామీ ఉన్న పంటలకే రైతులు మొగ్గు చూపుతున్నారు. ఈ ఏడాది వర్షపాతం ఆశించిన స్థాయిలో ఉండదని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వ్యవసాయ శాఖ ముందుగానే ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రచారం ప్రారంభించింది. పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాలు, ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ వంటి పంటలను సాగు చేయాలని అధికారులు గ్రామ గ్రామాన తిరిగి రైతులను చైతన్యపరిచారు. కానీ రైతుల నుంచి ఆశించిన స్పందన రాలేదు. ఎందుకంటే ప్రచారం ఎంత చేసినా, చివరికి రైతు అడిగే ప్రశ్న ఒక్కటే "పంట పండితే కొనేది ఎవరు?" ఇదే ప్రశ్నకు ప్రభుత్వాల వద్ద ఇప్పటికీ స్పష్టమైన సమాధానం లేదు. వరి, పత్తి, మొక్కజొన్నకు కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర ప్రకటిస్తుంది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుంది. మార్కెటింగ్ వ్యవస్థ ఉంది. ఆలస్యమైనా డబ్బులు వస్తాయనే నమ్మకం రైతుకు ఉంది. కానీ పప్పుధాన్యాలు, నూనెగింజలు, పండ్లు, కూరగాయలు, పూల పంటల విషయంలో పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. ధరలు మార్కెట్‌పై ఆధారపడి మారిపోతుంటాయి. దళారులే ధర నిర్ణయిస్తారు. ప్రభుత్వం కొనుగోలు చేసే వ్యవస్థ చాలా పరిమితంగా ఉంటుంది. ఫలితంగా రైతు పెట్టుబడి తిరిగి వస్తుందో లేదో తెలియని పరిస్థితి ఏర్పడుతుంది. అలాంటి పరిస్థితిలో రైతు కొత్త పంటల వైపు వెళ్లకపోవడాన్ని తప్పుపట్టడం సమంజసం కాదు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఖరీఫ్‌లో 132 లక్షల ఎకరాల్లో సాగు జరుగుతుందని అంచనా వేసింది. కానీ ఇప్పటివరకు కేవలం 59.83 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగు జరిగింది. అంటే లక్ష్యంతో పోలిస్తే కేవలం 45 శాతం మాత్రమే. ఇందులో కూడా పత్తి 41.12 లక్షల ఎకరాల్లో, వరి 6.40 లక్షల ఎకరాల్లో సాగైంది. మిగిలిన పంటలన్నీ కలిపి సుమారు 12 లక్షల ఎకరాలకు మాత్రమే పరిమితమయ్యాయి. ఈ గణాంకాలు రైతులు ప్రభుత్వ సూచనలను ఎందుకు పట్టించుకోవడం లేదనే విషయాన్ని స్పష్టంగా చెబుతున్నాయి. రైతు వర్షాలపై మాత్రమే ఆధారపడడం లేదు. ప్రభుత్వ విధానాలపై కూడా ఆధారపడుతున్నాడు. వర్షాలు లేకపోతే బీమా ఉందా? మార్కెట్ ధర పడిపోతే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందా? దళారుల నుంచి రక్షణ ఉందా? నిల్వ సదుపాయాలు ఉన్నాయా? ఇవన్నీ రైతు లెక్కలోకి వస్తాయి. ఈ ప్రశ్నల్లో ఎక్కువ వాటికి ప్రభుత్వాల వద్ద స్పష్టమైన సమాధానం లేకపోవడమే ప్రత్యామ్నాయ పంటల విస్తరణకు అడ్డంకిగా మారుతోంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత వరి సాగు విస్తీర్ణం భారీగా పెరిగింది. రాష్ట్ర ఏర్పాటు సమయంలో సుమారు 49 లక్షల ఎకరాల్లో సాగైన వరి, ప్రస్తుతం రెండు సీజన్‌లు కలిపి 127 లక్షల ఎకరాలకు చేరింది. పత్తి కూడా 51 లక్షల ఎకరాల నుంచి 65 లక్షల ఎకరాలకు పెరిగింది. కానీ మ-రోవైపు ఉద్యాన పంటలు తీవ్రంగా క్షీణించాయి. పండ్ల తోటలు సగానికి పైగా తగ్గిపోయాయి. కూరగాయల సాగు ఐదు లక్షల ఎకరాల నుంచి లక్ష ఎకరాలకు పడిపోయింది. పూల తోటలు, పసుపు, నూనెగింజలు, పప్పుధాన్యాల విస్తీర్ణం కూడా గణనీయంగా తగ్గింది. వ్యవసాయంలో వైవిధ్యం పెరగాల్సిన సమయంలో ఏకపంట విధానం బలపడటం ఆందోళన కలిగించే పరిణామం. దీనికి రాజకీయ కారణాలు కూడా ఉన్నాయి. వరి కొనుగోలు రాజకీయంగా సున్నితమైన అంశంగా మారింది. రైతు ఓటును దృష్టిలో పెట్టుకొని అన్ని ప్రభుత్వాలు వరి కొనుగోలుపై ఎక్కువ దృష్టి పెట్టాయి. కానీ ప్రత్యామ్నాయ పంటలకు అదే స్థాయి ప్రాధాన్యం ఇవ్వలేదు. ఫలితంగా రైతు కూడా ప్రభుత్వ ప్రాధాన్యత ఏ పంటకో అదే పంటను సాగు చేయడం ప్రారంభించాడు. విధానాల ద్వారా ప్రభుత్వాలే పంటల ఎంపికను ప్రభావితం చేస్తున్నాయనే విమ-ర్శకు ఇదే నిదర్శనం. మరోవైపు ఉద్యాన పంటల సాగులో కోతుల బెడద తెలంగాణలో పెద్ద సమస్యగా మారింది. పండ్లు, కూరగాయలు సాగు చేస్తే కోతుల దాడితో పంట నష్టపోతుందని రైతులు చెబుతున్నారు. దీనికి పరిష్కారంగా సోలార్ ఫెన్సింగ్‌కు రాయితీలు ఇస్తామని ఉద్యాన శాఖ ప్రకటించినా, అది ఇప్పటికీ విస్తృత స్థాయిలో అమలు కాలేదు. కేవలం ప్రకటనలు చేసి వదిలేయడం వల్ల రైతుల్లో ప్రభుత్వంపై విశ్వాసం తగ్గుతోంది. పంట బీమా కూడా మరో కీలక అంశం. వరి, పత్తి వంటి పంటలకు కొంతవరకు రక్షణ లభిస్తున్నా, ఉద్యాన పంటలు, కూరగాయలు, పూల తోటలకు సమగ్ర బీమా అందుబాటులో లేదు. వర్షాలు కురవకపోయినా, తుఫాన్లు వచ్చినా, మార్కెట్ ధరలు పడిపోయినా రైతే నష్టాన్ని భరించాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో రైతు ఎందుకు రిస్క్ తీసుకుంటాడు? వ్యవసాయం ఇప్పటికే అనిశ్చితులతో నిండిన రంగం. ఆ అనిశ్చితిని తగ్గించడం ప్రభుత్వ బాధ్యత. కానీ ప్రస్తుతం రైతే మొత్తం ప్రమాదాన్ని మోస్తున్నాడు. ఈ ఖరీఫ్‌లో మరో అంశం కూడా స్పష్టమైంది. రైతులు వ్యవసాయం మానేయడం లేదు. కానీ సాగును వాయిదా వేస్తున్నారు. ఆలస్యంగా వర్షాలు పడితే యాసంగిలో అయినా సాగు చేయొచ్చనే ఆశతో ఎదురుచూస్తున్నారు. అంటే రైతు పూర్తిగా నిరాశ చెందలేదు. కానీ ప్రభుత్వ సూచనలపై మాత్రం పూర్తి నమ్మకం ఉంచడం లేదు. ఇది విధానాల వైఫల్యానికి సంకేతం. రాజకీయంగా చూస్తే వ్యవసాయ రంగం కేవలం ఉత్పత్తి అంశం మాత్రమే కాదు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు, ఉపాధికి, ఎన్నికల రాజకీయాలకు కూడా కేంద్రబిందువు. అందుకే రైతు నిర్ణయాలు ప్రభుత్వాల రాజకీయ భవిష్యత్తును కూడా ప్రభావితం చేస్తాయి. రైతు ప్రత్యామ్నాయ పంటల వైపు వెళ్లాలంటే ముందు ప్రభుత్వం ప్రత్యామ్నాయ విధానాలను అమలు చేయాలి. ప్రచార యాత్రలు, అవగాహన సదస్సులు, అధికారుల సమావేశాలతో వ్యవసాయంలో మార్పు రాదు. ప్రత్యామ్నాయ పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించడం, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం, కోల్డ్ స్టోరేజ్‌లు, ప్రాసెసింగ్ యూనిట్లు, ఎగుమతి సదు-పాయాలు కల్పించడం, సమగ్ర పంట బీమా అమలు చేయడం, సోలార్ ఫెన్సింగ్‌ను రాయితీపై అందుబాటులోకి తేవడం, రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేయడం వంటి చర్యలు సమాంతరంగా అమలు కావాలి. అప్పుడే రైతు వరి, పత్తి నుంచి ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లే అవకాశం ఉంటుంది. వ్యవసాయ శాఖ కూడా కేవలం లక్ష్యాల ప్రకటనతో సరిపెట్టకుండా, పంటల వారీగా మార్కెట్ ప్రణాళికను ముందుగానే సిద్ధం చేయాలి. రైతు ఏ పంట వేయాలనే నిర్ణయం తీసుకునే ముందు, ఆ పంటను ఎవరు కొనుగోలు చేస్తారు, ఎంత ధరకు కొనుగోలు చేస్తారు, ఎక్కడ విక్రయించాలి అనే స్పష్టత ఇవ్వగలిగితేనే వ్యవసా-యంలో వైవిధ్యం సాధ్యమవుతుంది. మొత్తంగా చూస్తే ఈ ఖరీఫ్ రైతుల నిర్ణయం ప్రభుత్వ ప్రచారానికి వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయం కాదు. అది ప్రభుత్వ విధానాలపై రైతులు వ్యక్తం చేసిన అవిశ్వాసానికి ప్రతిబింబం. రైతు సంప్రదాయ పంటలను ఎంచుకోవడం మార్పును వ్యతిరేకించడం కాదు; భరోసా ఉన్న మార్గాన్ని ఎంచుకోవడమే. ఆ భరోసాను కల్పించడంలో ప్రభుత్వం విఫలమైతే ప్రత్యామ్నాయ పంటలపై ఎన్ని సమావేశాలు నిర్వహించినా, ఎన్ని ప్రచారాలు చేసినా ఫలితం ఉండదు. రైతు మనస్తత్వాన్ని మార్చే ముందు ప్రభుత్వ వ్యవసాయ విధానాలు మారాలి. ప్రచారం కాదు, మార్కెట్ హామీ కావాలి. సూచనలు కాదు, ఆదాయ భద్రత కావాలి. ప్రసంగాలు కాదు, విధానపరమైన సంస్కరణలు కావాలి. రైతు కోరేది కూడా అదే. ప్రభుత్వం అందించాల్సింది కూడా అదే.

# ఆశలు నెరవేరేనా?



రాష్ట్రంలో ప్రస్తుతం 37 కార్పొరేషన్ల పదవులకు సంబంధించిన చైర్మన్ల కాలపరిమితి ఇటీవలే ముగిసింది. ఈ పదవుల భర్తీపైన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య నేతలు సమీక్షలు, సమావేశాలను నిర్వహిస్తున్నారు. తాజాగా టీపీసీసీ చీఫ్50 కార్పొరేషన్ల చైర్మన్లు, పలు డైరెక్టర్ పదవులను ఈ నెలాఖరులోగా భర్తీ చేస్తామని ప్రకటించారు. దీంతో అధికార పార్టీలోని ఆశావహులు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మరోవైపు కాంగ్రెస్ మిత్రపక్షాలుగా వ్యవహరిస్తున్న తెలంగాణ జనసమితి, సీపీఐ పార్టీలు కూడా తమకూ నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించాలని కోరుతున్నట్లుగా తెలిసింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీకి సీపీఐ, టీజేఎస్ పార్టీలు మిత్రపక్షాలుగా ఉన్నాయి. కాంగ్రెస్‌తో కలిసి బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా పనిచేశాయి. ఇందులో భాగంగానే మిత్రపక్షమైన సీపీఐకి కొత్తగూడెం ఎమ్మెల్యే సీటును కేటాయించగా అక్కడనుంచి పోటీ చేసిన కూనంనేని సాంబశివరావు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మిత్రపక్షం కోటాలో సీపీఐకి చెందిన సీనియర్ నేత నెల్లికంటి సత్యంకు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కొత్తగూడెం కార్పొరేషన్‌లో హంగ్ ఏర్పడగా సీపీఐ, కాంగ్రెస్ కలిసి ఆ పీఠాన్ని కైవసం చేసుకున్నాయి. సీపీఐ మేయర్, కాంగ్రెస్ డిప్యూటీ మేయర్ పదవులను పంచుకున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం భర్తీ అవుతాయని భావిస్తున్న నామినేటెడ్ పోస్టుల విషయంలోనూ తమకు అవకాశం ఇవ్వాలని సీపీఐ పట్టుబడుతున్నట్లుగా కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

**ఎన్నికల వేళ ఇచ్చిన హామీ మేరకు..**

ఇక టీజేఎస్ కూడా కాంగ్రెస్ పార్టీతో కలిసి మిత్రపక్షంగా కొనసాగుతోంది. ఇటీవలే టీజేఎస్ చీఫ్ ప్రొ. కోదండరాం ఎమ్మెల్సీగా నియమితులయ్యారు. టీజేఎస్ మరో కీలకనేత ప్రొ. పీఎల్. విశ్వేశ్వరరావు తెలంగాణ విద్యా కమిషన్ మెంబర్‌గా కొనసాగుతున్నారు. రెండు నెలల్లో ఆయన పదవీకాలం కూడా ముగియనున్నదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కాగా, టీజేఎస్‌కి అసెంబ్లీ ఎన్నికల సమయంలో తమకు రెండు ఎమ్మెల్సీలు, 5 కార్పొరేషన్ల చైర్మన్లు, 4 జెడ్పీ చైర్మన్లు ఇస్తామని హామీ ఇచ్చినట్లుగా ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి. ఇంకా ఒక ఎమ్మెల్సీ, నాలుగు కార్పొరేషన్ల చైర్మన్ల పదవులు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీని విజ్ఞప్తి చేస్తున్నట్లుగా టీజేఎస్ వర్గాలు చెప్తున్నాయి. టీజేఎస్ సమావేశాల్లో కూడా నామినేటెడ్ పోస్టులపైన అధికార పార్టీని అడగాలన్న చర్చ జరుగుతోందని టీజేఎస్ నేతలు చెప్తున్నారు.

**సానుకూలంగా స్పందించే చాన్స్..!**

పదవుల భర్తీపై పీఎల్ విశ్వేశ్వరరావు ప్రస్తుత పోస్టును రెన్యువల్ చేయాలని, వీరితోపాటు ధర్మార్జున్, నిజ్జన రమేశ్ ముదిరాజ్, అంటి శ్రీనివాస్, భైరి రమేశ్, ఆశప్ప, సలీంపాషాల పేర్లు ఉన్నాయని టీజేఎస్ వర్గాలు తెలిపాయి. ప్రొ. కోదండరాం కూడా ప్రస-్తుతం ప్రభుత్వంలో కీలక నేతగా ఉన్నారు. ప్రభుత్వం నియమించిన తెలంగాణ ఉద్యమ గుర్తింపు కమిటీలో సభ్యులుగా కొనసాగుతున్నారు. కాంగ్రెస్ పార్టీ కూడా మిత్రపక్షాల నుంచి వస్తున్న డిమాండ్ల పట్ల సానుకూలంగానే ఉందని, పదవుల భర్తీపైన ఆయా పార్టీలకు పదవుల కేటాయింపుపైన తగిన సమ-యంలో నిర్ణయం తీసుకుంటుందని హస్తం వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ పార్టీ వచ్చే జెడ్పీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మిత్రపక్షాలకు నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత ఇచ్చే చాన్సెస్ ఎక్కువగా ఉ న్నాయని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతోపాటుగా వరంగల్, ఖమ్మం కార్పొరేషన్ల ఎన్నికలు, ఇటు గ్రేటర్ హైదరాబాద్, మల్కాజ్‌గిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికలు కూడా రాబోతున్నాయి. ఈ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రాజకీయ శక్తుల ఐక్యత కోసం మిత్రధర్మాన్ని కాంగ్రెస్ పాటిస్తుందన్న చర్చ అటు పార్టీలో ఇటు రాజకీయ వర్గాల్లో నడుస్తోంది.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539 flashindia999@gmail.com

# వాదనలు బలంగా ఉండాలి..

**న్యూ ఢిల్లీ :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభానికి ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ ప్రజలకు, రాజకీయ పార్టీలకు కీలక సందేశం ఇచ్చారు. ఈ సమావేశాలు దేశానికి అత్యంత ఫలవంతంగా ఉండాలని ఆకాంక్షిస్తూ, పార్లమెంట్‌లో చర్చలు తర్కం, వాస్తవాల ఆధారంగా సాగాలని అన్నారు. "వాదనలు, వాస్తవాలు ఉన్నచోట అనవసరమైన రాద్ధాంతం అవసరం లేదు. వాస్తవాలు బలంగా ఉంటే గొంతు పెంచాల్సిన అవసరం ఉండదు" అని ప్రధాని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ సమావేశాలకు ముందు మీడియాతో మాట్లాడిన ప్రధాని మోడీ.. రుతుపవనాలు ఎంత ముఖ్యమో, వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు కూడా అంతే ఫలవంతంగా సాగాలని ఆకాంక్షించారు. రుతుపవనాలు చురుకుగా ఉండి రైతులకు మేలు చేయడంతో పాటు, పార్లమెంట్ సమావేశాలు కూడా సజావుగా జరిగి దేశ ప్రయోజనాలకు దోహదపడాలని కోరుకున్నారు. గత నెలలో భారత్ సాధించిన పలు విజయాలను ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. జాతీయ, అంతర్జాతీయ, అంతరిక్ష రంగాల్లో దేశం విశేష పురోగతి సాధించిందని తెలిపారు. ఇటీవల ఒక భారతీయ యువత నేతృత్వంలోని స్టార్టప్ అంతరిక్ష రంగంలో కీలక మైలురాయిని చేరుకోవడం దేశానికి గర్వకారణమని అన్నారు. గత ఏడాది భారతీయ వ్యోమగామి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఉండగా, ఇప్పుడు భారత యువత అంతరిక్ష సాంకేతిక రంగంలో కొత్త అవకాశాలను సృష్టిస్తోందని పేర్కొన్నారు. ఇది యువత సామర్థ్యం, ఆశయాలు అపరిమితమని ప్రపంచానికి చాటి చెబుతోందని అన్నారు మోడీ..దేశ అభివృద్ధి దిశగా ప్రభుత్వం చేపట్టిన పలు కార్యక్రమాలను కూడా ప్రధాని వివరించారు. ఇటీవల రాజస్థాన్‌లో భారీ చమురు శుద్ధి కర్మాగారాన్ని దేశానికి అంకితం చేసినట్లు గుర్తు చేశారు. అలాగే దేశంలోని మూడో సెమీకండక్టర్ ప్లాంట్ ప్రారంభం, గ్రీన్ హైడ్రోజన్‌తో నడిచే రైలు ప్రారంభం వంటి ప్రాజెక్టులు భారత సాంకేతిక సామర్థ్యానికి నిదర్శనాలని పేర్కొన్నారు. ప్రపంచంలో కొద్ది దేశాలకు మాత్రమే ఉన్న గ్రీన్ హైడ్రోజన్ రైలు సాంకేతికత ఇప్పుడు భారత్‌లో అందుబాటులోకి రావడం గర్వకారణమని చెప్పారు ప్రధాని మోడీ..ఈ వర్షాకాల సమావేశాల్లో ప్రభుత్వం పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. వాటిలో ఆదాయపు పన్ను సవరణ బిల్లు-2026, సుప్రీంకోర్టు సవరణ బిల్లు-2026, జాతీయ గౌరవానికి అవమానాల నివారణ సవరణ బిల్లు-2026, జనన-మరణాల నమోదు సవరణ బిల్లు-2026, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి సవరణ బిల్లు-2026, విదేశీ విరాళాల సవరణ బిల్లు-2026, అలాగే డెవలప్ ఇండియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ బిల్లు-2025 వంటి ప్రతిపాదనలు ఉన్నాయి. వీటిలో కొన్ని పరిపాలనా సంస్కరణలు, న్యాయవ్యవస్థ బలోపేతం, విద్యా రంగ పునర్వ్యవస్థీకరణ, ఎంఎస్‌ఎంఈలకు ఆర్థిక ప్రోత్సాహం వంటి అంశాలకు సంబంధించినవిగా ప్రభుత్వం పేర్కొంది మోడీ..కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపిన వివరాల ప్రకారం, జూలై 20 నుంచి ఆగస్టు 13 వరకు 25 రోజుల వ్యవధిలో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు కొనసాగనున్నాయి. ఈ కాలంలో మొత్తం 19 సమావేశాలు జరగనున్నాయి. జాతీయ ప్రాధాన్యం కలిగిన అంశాలపై చర్చలు, సంప్రదింపులు, కీలక నిర్ణయాలు ఈ సమావేశాల్లో తీసుకునే అవకాశం ఉంది. ప్రభుత్వం, ప్రతిపక్షాలు ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా చర్చించి ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయాలని ఆకాంక్షించారు ప్రధాని నరేంద్ర మోడీ..

**రాహుల్ గాంధీపై ప్రధాని మోదీ వ్యంగ్యాస్త్రాలు..**

లోక్‌సభ ప్రతిపక్ష నేత, ఎంపీ రాహుల్ గాంధీపై ప్రధాని నరేంద్ర మోదీ పరోక్షంగా వ్యంగ్యాస్త్రాలు సంధించారు. సమావేశాలకు ముందు పార్లమెంట్ భవనం వెలుపల ప్రసంగించిన మోదీ.. భారత్ తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ విక్రమ్-1 విజయాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంగా విజయానికి కారణమైన యువ శాస్త్రవేత్తలను ఆయన అభినందించారు. అదే సమయంలో ఎంపీ రాహుల్ గాంధీని ఉద్దేశిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌కు చెందిన ప్రైవేట్ అంతరిక్ష సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ అభివృద్ధి చేసిన విక్రమ్-1 విజయవంతంగా కక్ష్యలోకి చేరడం దేశానికి గర్వకారణమని ప్రధాని మోదీ అన్నారు. ఈ ప్రాజెక్టుపై పని చేసిన బృందం సగటు వయస్సు కేవలం 28 సంవత్సరాలు మాత్రమేనని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తాను 56 ఏళ్ల యువకుడి గురించి మాట్లాడటం లేదంటూ రాహుల్ గాంధీపై పరోక్షంగా సెటైర్ వేశారు. ఇటీవల 56 ఏళ్లు పూర్తి చేసుకున్న రాహుల్ గాంధీని కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడిగా ప్రచారం చేస్తుండటాన్ని ఉద్దేశించే ప్రధాని ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. 2014 లోక్‌సభ ఎన్నికల వేళ ప్రధాని మోదీది '56 అంగుళాల ఛాతీ' అంటూ పలువురు బీజేపీ నేతలు చెప్పారు. ఈ వ్యాఖ్యను కాంగ్రెస్ నేతలు అనేక సందర్భాల్లో విమర్శలకు ఉపయోగించారు. ఈ ఏడాది పార్లమెంట్‌లో చైనా అంశంపై మాట్లాడిన రాహుల్ గాంధీ.. '56 అంగుళాల ఛాతీ ఏమైంది?' అంటూ ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. ఆ వ్యాఖ్యలకు ప్రతిస్పందనగానే ఇప్పుడు మోదీ '56 ఏళ్ల యువకుడు' అంటూ కౌంటర్ ఇచ్చినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.ఎంపీ రాహుల్ గాంధీపై విమర్శలు చేస్తూనే స్కైరూట్ యువ బృందం సాధించిన విజయం దేశ యువతలో అపారమైన ఆత్మవిశ్వాసాన్ని నింపిందని మోదీ అన్నారు. అంతరిక్ష రంగంలో దేశ యువత సామర్థ్యానికి ఇది నిదర్శనమని కొనియాడారు. ప్రపంచ వేదికపై భారత ప్రతిష్ఠ రోజురోజుకూ పెరుగుతోందని, దేశ యువత ఆశయాలకు ఆకాశమే హద్దు కాదనే సందేశాన్ని ఈ విజయం ఇచ్చిందన్నారు.మరోవైపు, వర్షాకాల సమావేశాలు దేశ ప్రయోజనాల దిశగా సాఫీగా సాగాలని మోదీ ఆకాంక్షించారు. పార్లమెంట్‌లో వాస్తవాలు, తర్కంతో కూడిన చర్చలు జరగాలని సభ్యులకు ఆయన పిలుపునిచ్చారు. ప్రతి సభ్యుడి స్వరం వినిపించేలా సభ నడవాలని, అనవసర గందరగోళానికి తావు లేకుండా ప్రజా సమస్యలపై నిర్మాణాత్మక చర్చలు జరగాలని ప్రధాని మోదీ సూచించారు.

# సుప్రీంకోర్టు కీలక ఆదేశం




**న్యూ ఢిల్లీ :** దేశంలోని వివిధ హైకోర్టులకు చెందిన రిటైర్డ్ జడ్జీల వసతులపై దేశవ్యాప్తంగా ఒకే విధానంపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. రిటైర్డ్ జడ్జీలకు అందించే పారితోషికాలు, భద్రత, వైద్యం, ఇతర వసతులలో దేశవ్యాప్తంగా ఒకే విధమైన ఏకరూపత ఉండేలా మార్గదర్శకాలను రూపొందించేందుకు ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మార్గదర్శకాలు రాష్ట్రానికి రాష్ట్రానికి మధ్య మారడానికి ఎలాంటి కారణం లేదని, వృద్ధులను, సీనియర్ సిటిజన్లను గౌరవంగా చూసుకోవడం మన భారతీయ సంస్కృతిలో ఒక భాగమని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం వ్యాఖ్యానించింది.కేంద్ర ప్రభుత్వం రెండు వారాల వ్యవధిలోగా ఈ కమిటీని ఏర్పాటు చేయాలని, ఆ కమిటీ ఏర్పాటైన మూడు నెలల్లోగా తన సిఫార్సుల నివేదికను కేంద్ర ప్రభుత్వానికి మరియు సుప్రీంకోర్టుకు సమర్పించాలని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ సౌకర్యాలకు అయ్యే ఆర్థిక భారాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ నిష్పత్తిలో పంచుకోవాలనే మెకానిజంపై కూడా కమిటీ స్పష్టమైన నివేదిక ఇవ్వాలని కోరింది. కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టు సూచనపై సానుకూలంగా స్పందిస్తూ.. ఈ కమిటీ ఏర్పాటుకు ప్రభుత్వం త్వరితగతిన చర్యలు తీసుకుంటుందని అత్యున్నత న్యాయస్థానానికి హామీ ఇచ్చారు.

# విద్యా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలి



**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** గురుకుల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, పోషకాహారం అందించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. సోమవారం, జిల్లాలోని కొడకండ్ల మండలంలోని మొండ్రాయి మహాత్మా జ్యోతి భా పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా సందర్శించి, విద్యా బోధన, మౌలిక సదుపాయాలు, విద్యార్థుల అభ్యాస సామర్థ్యం, పరిశుభ్రత, ఆహార నాణ్యత, తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.పాఠశాలలోని స్టోర్ రూమ్‌ను తనిఖీ చేసిన కలెక్టర్, అక్కడ నిల్వ ఉంచిన పాత పుస్తకాలను పరిశీలించారు.ఉపయోగంలో లేని పాత పుస్తకాలను వెంటనే వేరు చేసి, ఈరోజు సాయంత్రం లోగా స్టోర్ రూమ్‌ను పూర్తిగా శుభ్రం చేసి, అవసరం లేని వస్తువులను తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాఠశాలలో ప్రతి గది పరిశుభ్రంగా, క్రమబద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం కంప్యూటర్ ల్యాబ్‌ను పర్యవేక్షించి, కంప్యూటర్ల వినియోగం, విద్యార్థులకు అందుతున్న డిజిటల్ విద్యా సదుపాయాల గురించి ఆరా తీశారు. ప్రతి విద్యార్థి కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందించుకునేలా ప్రణాళికాబద్ధంగా శిక్షణ అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.తదుపరి 10వ తరగతి గదిని సందర్శించిన కలెక్టర్, బోధన విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. గణిత ఉపాధ్యాయురాలికి ఒక గణిత సమస్యను ఇచ్చి దాన్ని సాధించాలని తెలిపారు .అలాగే విద్యార్థులకు కూడా మాథ్స్ లోని కొన్ని సమస్య లను ఇచ్చి వాటిని పరిష్కరించాలని తెలియజేసి....వారి పరిజ్ఞానాన్ని పరిశీలించారు అనంతరం కలెక్టర్ స్వయం గా ఆ సమస్య లను సులభంగా ఎలా చేదించాలో వారికి బోధించారు ప్రతి అంశాన్ని భావనతో వివరించేలా ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని సూచించారు.అదే విధంగా హిందీ పాఠ్య పుస్తకంలోని కొన్ని పాఠాలను కలెక్టర్ స్వయంగా చదివి వినిపించారు. పదాల ఉచ్చారణ, చదివే తీరు, భావవ్యక్తీకరణ ఎలా ఉండాలో విద్యార్థులకు వివరించి చూపించారు.ప్రతిరోజూ విద్యార్థులతో పాఠ్య పుస్తకాల పఠనంపై ప్రత్యేకంగా సాధన నిర్వహించాలని, తద్వారా భాషా నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని ఉపాధ్యాయులకు సూచించారు.విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడిన కలెక్టర్, "ఈరోజు బ్రేక్‌ఫాస్ట్‌లో ఏమి తిన్నారు?" అని అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ అందించే ఆహారాన్ని పూర్తిగా తీసుకోవాలని, ముఖ్యంగా పాలను తప్పకుండా తాగాలని విద్యార్థులకు సూచించారు. ఆరోగ్యవంతమైన శరీరం ఉన్నప్పుడే చదువులో మంచి ఫలితాలు సాధించగలరన్నారు.అనంతరం వంట శాల వద్ద ప్రదర్శించిన మెనూ చార్ట్‌ను పరిశీలించిన కలెక్టర్, అందులో పేర్కొన్న విధంగానే ఆహారం వండుతున్నారా?లేదా? అని తనిఖీ చేశారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పోషకాహారం అందించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యతలో గాని... మెనూ ప్రకారం గా భోజనం అందించకపోతె చర్యలు తప్పవన్నారు పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య, క్రమశిక్షణ, పరిశుభ్రమైన వాతావరణం, పోషకాహారం, ఆధునిక విద్యా సదుపాయాలు అందుబాటులో ఉండేలా అధికారులు, ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

# సోనమ్ వాంగ్‌చుక్ సంచలన లేఖ




**ఢిల్లీ :** నీట్ పేపర్ లీక్, విద్యావ్యవస్థలో వైఫల్యాలపై గత 20 రోజులకు పైగా నిరాహార దీక్ష చేస్తున్న ప్రముఖ విద్యావేత్త, సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ తన దీక్షను విరమించడానికి మూడు షరతులను విధించారు. ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో తనను అక్రమంగా నిర్బంధించారని పేర్కొంటూ ఆయన చేతిరాతతో రాసిన ఒక లేఖను తాజాగా ఆయన ఎక్స్ వేదికగా విడుదల చేశారు. ప్రభుత్వం, రాజకీయ పార్టీలు తన షరతులను నెరవేరిస్తే ఈరోజే దీక్షను విరమించడానికి సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు.

**మూడు డిమాండ్లు ఇవే:**

ఇటీవల జరిగిన నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీలతో సహా దేశ విద్యావ్యవస్థలో జరుగుతున్న వైఫల్యాలకు ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని సోనమ్ డిమాండ్ చేశారు. అలాగే నీట్ పేపర్ లీకేజీల అంశాన్ని పార్లమెంట్‌లో ఖచ్చితంగా లేవనెత్తుతామని రాజకీయ నాయకులు తనకు హామీ ఇవ్వాలన్నారు. అరోగ్యం పరిస్థితి దృష్ట్యా కాక్రోచ్ జనతా పార్టీ నిర్వహించ తలపెట్టినపార్లమెంట్ మార్చ్‌లో తాను పాల్గొనలేకపోతే, అగ్రశ్రేణి రాజకీయ నాయకులు ఆసుపత్రికి వచ్చి పైన పేర్కొన్న షరతులపై తనకు స్వయంగా హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**జంతర్ మంతర్ వద్ద ఉద్రిక్తత.. ఢిల్లీలో సెక్యూరిటీ టైట్:**

మరోవైపు ఇవాళ పార్లమెంట్ మార్చ్ కు కాక్రోచ్ జనతా పార్టీ పిలుపు ఇచ్చిన నేపథ్యంలో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. చలో సంసద్ కార్యక్రమానికి అనుమతి లేదని కాక్రోచ్ జనతా పార్టీ మద్దతుదారులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బారికేడ్లను దాటుకుని వెళ్లే ప్రయత్నం చేయగా వారిని ఢిల్లీ పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఢిల్లీ పోలీసులు, ప్రత్యేక బలగాలు, సీజేపీ నిరసన కారుల మధ్య ఒక్కసారిగా వాగ్వాదం చెలరేగి తోపులాటకు దారి తీసింది. దీంతో పోలీసులు, ప్రత్యేక బలగాలు లాఠీచార్జ్ చేసి ఆందోళన కారులను చెదరగొట్టారు. మరోవైపు ఢిల్లీలోని మెట్రో, జేఎన్‌యూ వంటి కీలక ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇతర పబ్లిక్ ప్రాంతాల్లో కూడా తనిఖీలు చేసిన అనంతరమే వాహనాలను అనుమతి ఇస్తున్నారు.

# పామాయిల్ ధర పెరిగింది..

**ఖమ్మం,ఫ్లాష్ ఇండియా :** పామాయిల్ ధర పెంపునకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లా వ్యవసాయంపై ఆధారపడిన జిల్లా అని పేర్కొన్నారు. ఈ రోజు(సోమవారం) ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం అంజనాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన గోద్రెజ్ ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరు కావాల్సి ఉందని.. వివిధ కారణాలతో సీఎం రాలేకపోయారని చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా రైతులకు సీఎం రేవంత్‌రెడ్డి తన శుభాకాంక్షలు తెలిపారని అన్నారు.

**ఖమ్మం జిల్లా రైతులు అన్నిరకాల పంటలు సాగు చేస్తారు..**

అంజనాపురంలో ఆయిల్ పామ్ కాంప్లెక్స్ నిర్మించిన గోద్రెజ్ సంస్థకు భట్టి విక్రమార్క కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఆయిల్ పాం కాంప్లెక్స్ నిర్మాణానికి విశేషంగా కృషిచేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి అభినందనలు చెప్పారు. ఖమ్మం జిల్లా రైతన్నలు అన్ని రకాల పంటలు సాగు చేస్తారని వెల్లడించారు. తాను ఎన్నో రకాల పంటలు సాగు చేశానని ఏ పంటకు రాని దిగుబడి ఆయిల్ పామ్‌కు వచ్చిందని మంత్రి తుమ్మల స్వయంగా తనతో చెప్పారని అన్నారు. చివరకు ప్రకృతి విపత్తులను కూడా ఈ పంట తట్టుకొని నిలబడుతుందని చెప్పుకొచ్చారు. పామాయిల్ సాగు చేసిన రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వెల్లడించారు. దేశంలో 25 లక్షల మిలియన్ టన్నుల పామాయిల్ అవసరం ఉందని తెలిపారు. దేశంలో కేవలం 12 లక్షల మిలియన్ టన్నుల పామాయిల్ మాత్రమే ఉత్పత్తి అవుతుందని చెప్పుకొచ్చారు.

**పామాయిల్‌కు సహకారం అందిస్తాం..**

తమ ప్రభుత్వం మొదటి నుంచి పామాయిల్‌కు సహకారం అందిస్తుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. 1992లో ప్రారంభించిన పామాయిల్ సాగు ఇప్పటికి దేశంలోనే తెలంగాణను అగ్రగామిగా నిలిపే స్థాయికి వచ్చిందని వివరించారు. గతంలో పామాయిల్ టన్ను గెల ధర రూ.12000లు ఉంటే.. నేడు టన్ను ధర రూ.23 వేలకు పెరిగిందని వెల్లడించారు. అంజనాపురంలో ఆయిల్ పంప్ కాంప్లెక్స్ నిర్మాణం.. ఖమ్మం జిల్లా అన్నదాతలకు ఓ వరమని ఉద్ఘాటించారు. వ్యవసాయ ఉత్పత్తుల పరిశ్రమలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా వేదిక కాబోతోందని తెలిపారు. రాబోయే రోజుల్లో అనేక రకాల పరిశ్రమలు ఇక్కడికి రాబోతున్నాయని భట్టి విక్రమార్క వివరించారు.

**రైతులకు మంత్రి తుమ్మల పిలుపు..**

కొనిజర్ల మండలం అంజనాపురంలో నిర్మించిన గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లాలో గోద్రెజ్ కంపెనీ ఆయిల్ పామ్ కాంప్లెక్స్ నిర్మించడం సంతోషంగా ఉందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఈ కాంప్లెక్స్‌లో అత్యాధునిక సీడ్ గార్డెన్ ఏర్పాటు చేశారని తెలిపారు. గోద్రెజ్ కంపెనీకి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని, రైతులకు అన్ని విధాలా అందుబాటులో ఉండేలా కంపెనీ సేవలందించాలని ఆకాంక్షించారు.ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ ముందు ఉందని మంత్రి తుమ్మల తెలిపారు. రాష్ట్రంలో పది లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు కృషి జరుగుతోందని చెప్పారు. ఈ సందర్భంగా రైతులంతా ఈ పంట సాగుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆయిల్ పామ్‌తో ఎలాంటి నష్టం ఉండదన్నారు. ఆయిల్ పామ్ కింద ఇప్పటికే మూడు ఫ్యాక్టరీల నిర్మాణం పూర్తయిందని, మరో ఆరు ఫ్యాక్టరీల నిర్మాణం జరుగుతోందని వెల్లడించారు. తెలంగాణ భూములు ఆయిల్ పామ్ సాగుకు అనుకూలమని మంత్రి పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో అన్ని జిల్లాల్లో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీల నిర్మాణం జరగాలన్నదే తన లక్ష్యమని చెప్పుకొచ్చారు. దక్షిణ భారతదేశ నేతలందరూ ఆయిల్ పామ్ దిగుమతిపై సుంకం తగ్గించాలని కోరుతున్నామని మంత్రి చెప్పారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.రైతులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నామని, ఆయిల్ పామ్ సాగుతో వారి జీవితాల్లో వెలుగులు నింపుతామన్నారు మంత్రి తుమ్మల. తన యాభై సంవత్సరాల వ్యవసాయ అనుభవంలో ఎన్నో పంటలు పండించామని, ఏ పంటకు రాని ఆదాయం దీనికి వస్తుందన్నారు. ఆయిల్ పామ్‌ను ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన నాటి నుంచి తాను కూడా సాగు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మరోవైపు, ఎల్‌నినో ప్రపంచాన్ని కబళించే పరిస్థితి ఉందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. దాని కారణంగా రుతుపవనాలు సరిగా రాలేదని, మానవజాతి చేసిన విధ్వంసం తిరిగి మన పాలిటే మహమ్మారిగా మారిందన్నారు. దక్షిణ భారతదేశంలో ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉందని, ఉద్యానవన పంటల సాగుతో భూములను చల్లబరచాలని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

# విచారణకు రాకపోతే లీగల్ యాక్షన్




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (HYDRAA) కమిషనర్ ఏ.వీ. రంగనాథ్ పై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఓ కేసులో హైడ్రా పరిధిని దాటి జోక్యం చేసుకోవడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. చట్ట నిబంధనలకు లోబడి పనిచేయాల్సిన సంస్థ.. తమ పరిధిలో లేని అంశాల్లో ఎలా జోక్యం చేసుకుంటుందని ప్రశ్నించింది. ఇందుకు సంబంధించిన తదుపరి విచారణకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ వ్యక్తిగతంగా కోర్టు హాజరు కావాలని కోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాలను బేఖాతరు చేసి.. విచారణకు హాజరు కాని నేపథ్యంలో కఠిన చట్టపరమైన చర్యలకు సిఫార్సు చేయాల్సి ఉంటుందని తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. నగరంలో చెరువుల ఆక్రమణలు, ప్రభుత్వ స్థలాల రక్షణ పేరుతో ఇప్పటికే పలు నిర్మాణాలను కూల్చివేసిన హైడ్రాపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్న క్రమంలో.. నేడు హైకోర్టు రంగనాథ్ కు కీలక ఆదేశాలతో పాటు హెచ్చరిక జారీ చేయడం చర్చనీయాంశమయింది.

# ఉప్పల్ నియోజకవర్గంలో సర్ సమీక్ష సమావేశం

### బిఎల్ఓ లు అర్హులైన ప్రతి ఓటర్ కి న్యాయం జరిగేలా నాయకులను సమన్వయం చేసుకోవాలి డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రెష్ యాదవ్



**ఉప్పల్,ఫ్లాష్ఇండియా ప్రతినిధి :** మల్కాజ్గిరి కార్పొరేషన్ పరిధిలోని ఉప్పల్ నియోజకవర్గంలో, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో సర్ (ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ) కార్యక్రమంపై బీఎల్ఓ లు, సూపర్వైజర్లు, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు తోటకూర వజ్రెష్ యాదవ్,మల్కాజ్గిరి పార్లమెంట్ సర్ ఇన్చార్జి సుబ్రహ్మణ్యం,ఉప్పల్ నియోజకవర్గం సర్ ఇంచార్జి వరలక్ష్మి,ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వజ్రెష్ యాదవ్ మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణ ప్రక్రియను అత్యంత బాధ్యతతో నిర్వహించాలని, అర్హులైన ప్రతి ఓటరికి న్యాయం జరిగేలా బీఎల్ఓ లు, పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ఓటర్ల పేర్లు నమోదు చేయడంతో పాటు, ఎలాంటి పొరపాట్లు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు.అనంతరం సమావేశంలో పాల్గొన్న నాయకులతో కలిసి సర్ ప్రక్రియ పురోగతిపై సమీక్ష నిర్వహించి, అవసరమైన సూచనలు, సలహాలు అందించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, బీఎల్ఓ లు, సూపర్వైజర్లు,ప్రజాప్రతినిధులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల్ని ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

**మేడ్చల్ -మల్కాజిగిరి,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ (IDOC) సమావేశ మందిరంలో సోమవారం జిల్లా కలెక్టర్ మను చౌదరి ఐఏఎస్ అధ్యక్షతన జిల్లా రెవెన్యూ అధికారి ( డిఆర్ఓ ) మాలతి తో కలిసి 'ప్రజావాణి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన ప్రజలతో పాటు పలు రాజకీయ పార్టీల ప్రతినిధుల నుండి కలెక్టర్ స్వయంగా వినతులను స్వీకరించారు. సోమవారం ప్రజావాణిలో మొత్తం 84 అర్జీలు దాఖలయ్యాయి. అనంతరం కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా అందరి దరఖాస్తులను పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులకు పంపి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

# సొంత నిధులు 6 లక్షల తో గ్రామ దేవత పోచమ్మ తల్లి గుడి నిర్మాణం

### గ్రామ అభివృద్ధితో పాటు దైవ చింతనకు ప్రాధాన్యత ఇస్తున్న సర్పంచ్ డోకూరి సునిత ప్రభాకర్ రెడ్డి



**తలకొండ పల్లి ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** రంగారెడ్డి జిల్లా తలకొండ పల్లి మండలం పడకల్ గ్రామ సర్పంచ్ డోకురి సునిత ప్రభాకర్ రెడ్డి. గ్రామ దేవత శ్రీ పోచమ్మ తల్లి దేవాలయ నిర్మాణానికి సుమారు 6 లక్షల రూపాయల సహాయ సహకారాలు అందజేసి భక్తుల మన్ననలు పొందుతున్నారు.గత ఎన్నికల సమయంలో గ్రామస్తులతో మాట్లాడుతూ మీరు నన్ను గెలిపిస్తే గ్రామ దేవత గుడిని నా సొంత నిధులతో కట్టిస్తా అని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు ఇప్పుడు గుడి నిర్మాణ పనులకు ఆర్థిక సహాయం అందజేశారు. పడకల్ గ్రామ ప్రజలు నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయను. గ్రామ దేవత ఆశీస్సులు మనందరికీ ఉండాలి. అందుకే ఈ గుడి నిర్మాణం నా బాధ్యతగా భావించి ముందుకు వచ్చాను" అని తెలిపారు. 6 లక్షలతో ఆధునిక దేవాలయం. సుమారు 6 లక్షల రూపాయల వ్యయంతో ఈ ఆలయాన్ని నిర్మిస్తున్నారు. గుడికి పటిష్టమైన పునాదులు, అందమైన గోపురం, భక్తులు కూర్చోవడానికి విశాలమైన ప్రాంగణం ఉండేలా ప్రణాళికలు రూపొందించారు. ప్రస్తుతం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సర్పంచ్ సునిత సేవలను గ్రామ ప్రజలందరూ అభినందిస్తున్నారు. త్వరలోనే ఆలయ నిర్మాణం పూర్తి చేసి ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించాలని గ్రామ కమిటీ సభ్యులు తెలిపారు

# ఇందిరమ్మ రాజ్యం లో పేదోడి సొంతింటి కళ సాకారం ఏ ఎంసీ డైరెక్టర్ చర్ల వెంకట్ రెడ్డి

**తలకొండ పల్లి ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదల కల నెరవేరుతోంది. రంగారెడ్డి జిల్లా, తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. ఇందిరమ్మ రాజ్యం లో పేదోడి సొంతింటి కళ సాకారం చేస్తూ ముందుకు సాగుతున్న రేవంత్ రెడ్డి. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా వెల్జాల్ గ్రామానికి చెందిన ఆయిల్ పెంటమ్మ కు మంజూరు అయ్యింది. ఇంటి స్లాబ్ పనులను వెల్జాల్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఇందిరమ్మ కమిటీ సభ్యులు పి అశోక్ బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేద ప్రజలకు నిజమైన సంక్షేమం జరుగుతుంది. ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు ఇచ్చే బాధ్యత మాది అని అన్నారు.మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ఇల్లు లేని ప్రతి పేదవారికి విడతల వారీగా ఇల్లు మంజూరు చేస్తున్నాం. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం అని తెలిపారు.



కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్ రెడ్డి. పి. అశోక్ బాబు, బి. నర్సింలు, టి. కృష్ణయ్య గౌడ్, పులిజాల విష్ణు. మాజీ ఎంపీటీసీ అంబాజీ మాజీ ఉప సర్పంచ్ అజీజ్, నాయకులు లకు మల్లేష్, ఎం.డి. యూసుఫ్, వద్దే రాజు, టి. లచ్చయ్య గౌడ్, బి. శ్రీనివాసులు, ఆఫ్తాబ్, కె. శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

# పురపాలక సంఘ కార్యాలయము జనగామ పత్రికా ప్రకటన

**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** హోటల్, రెస్టారెంట్ మరియు కిరాణా దుకాణాల యజమానుల కోసం ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల నిషేధంపై అవగాహన సమావేశం ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల నిషేధంపై హోటల్, రెస్టారెంట్ మరియు కిరాణా దుకాణాల యజమానులతో ఛైర్పర్సన్ మరియు మున్సిపల్ కమిషనర్ అధ్యక్షతన అవగాహన సమావేశం నిర్వహించబడింది.ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిషేధిత ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వాడకం, అమ్మకం, నిల్వ మరియు పంపిణీ నిషేధించబడిందని తెలియజేశారు. దుకాణాల యజమానులందరూ ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వాడకాన్ని తక్షణమే ఆపివేయాలని, దానికి బదులుగా గుడ్డ సంచులు, కాగితపు సంచులు లేదా ఇతర జీవవిచ్ఛిన్నమయ్యే సంచుల వంటి పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయాలను ఉపయోగించమని వినియోగదారులను ప్రోత్సహించాలని ఆదేశించారు.పర్యావరణాన్ని పరిరక్షించడంలో మరియు ప్రజారోగ్యాన్ని కాపాడటంలో మున్సిపాలిటీకి సహకరించాలని కమిషనర్ అన్ని వ్యాపార సంస్థలకు విజ్ఞప్తి చేశారు. నిషేధిత ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను ఉపయోగిస్తున్న లేదా విక్రయిసున్నట్లు తేలితే, వారిపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, జరిమానాలతో సహా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల నిషేధాన్ని అమలు చేయడంలో మరియు




వినియోగదారులలో అవగాహన కల్పించడంలో తమ పూర్తి సహకారాన్ని మున్సిపాలిటీకి అందిస్తామని హోటల్, రెస్టారెంట్ మరియు కిరాణా దుకాణాల యజమానులందరూ హామీ ఇచ్చారు.ఇట్టి కార్యక్రమంలో గౌరవ ఛైర్పర్సన్ గారు, గౌరవ కమీషనర్ గారు, ఫుడ్ ఇన్స్పెక్టర్, సానిటరీ ఇన్స్పెక్టర్ మరియు మునిసిపల్ అధికారులు పాల్గొనడం జరిగింది.కమీషనర్,పురపాలక సంఘం, జనగామ.

# విద్యాసంస్థలపై నిరాధార ప్రచారాలు నిలిపివేసి, వాస్తవ నిర్ధారణతో వ్యవహరించాలి

**నల్లగొండ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మహాత్మా గాంధీ యూనివర్సిటీ అనుబంధ ఆరోరా లా కాలేజీకి సంబంధించి కొన్ని మీడియా వేదికల్లో ప్రసారమవుతున్న కథనాలపై లా స్టూడెంట్ కత్తుల కాన్షీరామ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ, వాస్తవ నిర్ధారణ పూర్తికాకముందే ఏ విద్యాసంస్థపైనా ఏకపక్ష కథనాలు ప్రసారం చేయడం వల్ల సంస్థ ప్రతిష్ఠకు నష్టం కలిగే అవకాశం ఉందని అన్నారు. ఇటువంటి కథనాలు విద్యార్థులు, తల్లిదండ్రుల్లో అనవసర ఆందోళనలు సృష్టించే ప్రమాదం కూడా ఉందని పేర్కొన్నారు. ఏవైనా అక్రమాలు లేదా లోపాలపై అనుమానాలు ఉంటే, వాటిని సంబంధిత చట్టబద్ధమైన అధికారుల దృష్టికి తీసుకెళ్లి విచారణ జరిపించాల్సిందే కానీ, విచారణకు ముందే మీడియా విచారణ పేరుతో తీర్పులు ఇవ్వడం సరైన విధానం కాదని అభిప్రాయపడ్డారు.కొంతమంది వ్యక్తులు స్వప్రయోజనాల కోసం మీడియాను వినియోగిస్తూ విద్యాసంస్థలపై ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని, అలాంటి అంశాలు నిజమైతే సంబంధిత అధికారులు సమగ్రంగా విచారించాలని ఆయన కోరారు. మీడియా ప్రజాస్వామ్యంలో కీలక




పాత్ర పోషిస్తుందని, అయితే ప్రతి కథనం వాస్తవ నిర్ధారణతో, నిష్పాక్షికంగా, బాధ్యతాయుతంగా ప్రసారం కావాలని సూచించారు. ఆధారాలు లేకుండా ఏ సంస్థ లేదా వ్యక్తి ప్రతిష్ఠకు భంగం కలిగించేలా కథనాలు ప్రసారం కాకుండా మీడియా సంస్థలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అవసరమైతే చట్టం కల్పించిన హక్కుల ప్రకారం సంబంధిత వర్గాలు న్యాయపరమైన మార్గాలను ఆశ్రయించవచ్చని పేర్కొంటూ, విద్యాసంస్థల గౌరవాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కత్తుల కాన్షీరామ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల లా విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అమ్మాలి






**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** నకిలీ ఎరువులను కాకుండా , నాణ్యమైన ఉత్పత్తులను మాత్రమే విక్రయించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు సోమవారం కొడకండ్ల మండలం గిర్నీ తండా లో గల శ్రీ అభయ్ ఫర్టిలైజర్ షాప్ ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసారు ఈ సందర్బంగా కలెక్టర్ షాప్ లైసెన్స్ పత్రాలను,కొనుగోలు రిజిస్టర్ పరిశీలించారు యూరియా, కాంప్లెక్స్ ఎరువుల నిల్వలను పరిశీలించారు ఈ పాస్ యంత్రం లో నమోదు అయిన కొనుగోలు వివరాలు, ప్రస్తుతం నిల్వ గల యూరియా బస్తాల సంఖ్య లో ఉన్న తేడా ని కలెక్టర్ గమనించి.... దీనికి సంబందించిన వివరణ ఇవ్వాలని..మండల వ్యవసాయ అధికారి కి కలెక్టర్ ఆదేశించారు ముమ్ముందు ఇలాంటి తేడా లు రాకుండా ఎప్పటికప్పుడు తనిఖీ లు చేస్తూ.... స్టాక్ వివరాలు, అమ్మకం వివరాలు సరిగ్గా ఉండేలా పర్యవేక్షణ చేయాలన్నారు ఎరువుల నిల్వలు, సరఫరా, విక్రయాల వివరాలు అన్నీ యూరియా యాప్ ద్వారా జరగాలన్నారు స్టాక్ రిజిస్టర్లు, స్టాక్ బోర్డును తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు నకిలీ విత్తనాలు లేదా కల్తీ ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సరిపడా నిల్వలు ఉండేలా డీలర్లు, వ్యవసాయ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఎరువుల సరఫరా, అమ్మకాల పైన నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. జిల్లాలో ఎరువుల అందుబాటుపై వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలన్నారు



# మిర్యాలగూడ రెవెన్యూ డివిజన్ ప్రజావాణికి 14 ఫిర్యాదులు

**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం జరిగిన డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి 14 ఫిర్యాదులు వచ్చాయని డీఎవో శ్రీనివాస శర్మ తెలిపారు మిర్యాలగూడ ఆర్డీవో కార్యాలయానికి 2 ఫిర్యాదులు,మిర్యాలగూడ ఎమ్మార్వో కార్యాలయానికి 7 ఫిర్యాదులు,మాడుగుల పల్లి ఎమ్మార్వో కార్యాలయానికి 1 ఫిర్యాదు,త్రిపురారం ఎమ్మార్వో కార్యాలయానికి 1 ఫిర్యాదు,మిర్యాలగూడ మున్సిపల్ కార్యాలయానికి 2 ఫిర్యాదులు,డిస్టిక్ లెవెల్ పంచాయతీ ఆఫీసర్ మిర్యాలగూడ కు 1 ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందుబాటులో ఉన్న డివిజన్ స్థాయి ప్రజావాణిలో ప్రజలు తమ సమస్యల పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.ఫిర్యాదులను సంబంధిత అధికారులకు అందజేసి సత్వరం పరిష్కరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ పి శ్రీనివాస్,ఎంపీడీవో శేషగిరి శర్మ,పలు శాఖల డివిజన్ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ జి కళాశాల అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం




**నల్లగొండ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** నాగార్జున ప్రభుత్వ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డా. సముద్రాల ఉపేందర్ తెలియజేశారు. సంబంధిత సబ్జెక్ట్ లో పీ.జి లో 55 శాతం మార్కులు ఉన్నవారు అర్హులు యస్.సి, యస్.టి వారికి పీ.జి లో 50 శాతం మార్కులు ఉన్నవారు అర్హులు, నెట్, సెట్, పి.హెచ్.డి మరియు బోధనా అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

**ఖాళీల వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నవి..**

బిబిఏ -2 ,బయోటెక్నాలజీ 01 ,బిజినెస్ అనలటిక్స్ 01, వాణిజ్యశాస్త్రం 02 ,కంప్యూటర్ సైన్స్/అప్లికేషన్స్ 06 ,డాటసైన్స్ 01 ,అర్ధశాస్త్రం 01 ,ఫైనాన్స్ -1 ,హింది 01 ,గణితశాస్త్రం 02 ,భౌతికశాస్త్రం 02 ,రాజనీతి శాస్త్రం 01,ప్రభుత్వపాలనశాస్త్రం 01 స్టాటిస్టిక్స్ 01 ,తెలుగు 04 ,ఉర్దూ 01 ,మొత్తం 28 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తి కల అభ్యర్థులు తమ యొక్క దరఖాస్తు ఫారాలను కళాశాల కార్యాలయములో తేది.24-07-2026 లోగా అందజేయగలరని తెలియజేశారు. దరఖాస్తుతో పాటు తమ యొక్క ఎస్ ఎస్ సి, ఇంటర్మీడియేట్, డిగ్రీ, పీజి మెమోలు, నెట్/సెట్/పిహెచ్.డి. సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, అనుభవ ధ్రువీకరణ పత్రాలు జతచేయాలి. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తేది. 27-07-2026 ఉదయం 10.30 గ.లకు కళాశాల లో ఇంటర్వ్యూకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# ఇక రిటైర్ అవ్వడమే బెటరా?




ఇంగ్లండ్‌తో జరిగిన మూడో వన్డేలో కూడా మణికట్టు స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు తుది జట్టులో చోటు దక్కలేదు. సిరీస్‌లోని మొదటి రెండు మ్యాచ్‌లలో ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ కారణంగా కుల్దీప్‌కు ప్లేయింగ్ 11లో ఆడలేదు. గాయం కారణంగా సుందర్ మూడో మ్యాచ్‌లో ఆడకున్నా.. కుల్దీప్‌కు అవకాశం రాలేదు. లార్డ్స్ మైదానంలో యువకులను ఆడించిన టీమిండియా మూల్యం చెల్లించుకుంది. కుల్దీప్‌కు అవకాశం రాకపోవడంపై మాజీ భారత క్రికెటర్ మహ్మద్ కైఫ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌పై తీవ్ర విమర్శలు గుప్పించిన కైఫ్.. వరుసగా అవకాశాలు ఇవ్వకుండా పక్కన పెడుతుంటే కుల్దీప్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలకాలని సూచిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశాడు. లార్డ్స్ వేదికగా జరిగిన మూడో వన్డేలో జస్ప్రీత్ బుమ్రా, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి వంటి ఆటగాళ్లు అందుబాటులో లేకపోయినా కుల్దీప్ యాదవ్‌కు జట్టులో చోటు కల్పించకపోవడం తనను ఆశ్చర్యానికి గురిచేసిందని కైఫ్ పేర్కొన్నాడు. 'కుల్దీప్ యాదవ్ ఇప్పుడు తన బ్యాగులు సర్దుకుని అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు చెప్పాలా అనే ఆలోచన చేయాల్సిన పరిస్థితి వచ్చింది. బుమ్రా లేడు, వాషింగ్టన్ లేడు, వరుణ్ కూడా లేడు. అయినా కుల్దీప్‌కు తుది జట్టులో స్థానం దక్కలేదు. లార్డ్స్‌లో భారత బౌలింగ్ ఒకే తరహాలో కనిపించింది. ఎడమచేతి రిస్ట్ స్పిన్నర్ ఉంటే జట్టుకు ఎంతో ఉపయోగపడేవాడు. 118 వన్డేల్లో 194 వికెట్లు తీసిన రికార్డులు కూడా ఇప్పుడు విలువలేనివిగా కనిపిస్తున్నాయి' అని 'ఎక్స్'లో కైఫ్ రాసుకొచ్చాడు. కుల్దీప్‌ను వరుసగా పక్కన పెట్టడంపై భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కూడా ఫైర్ అయ్యాడు. 'కుల్దీప్‌ను ఆడించకపోవడానికి బ్యాటింగ్ డెప్త్ అవసరమనే కారణం చెప్పారు. కానీ ఇప్పుడు అర్ష్‌దీప్ సింగ్ ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్ చేస్తున్న పరిస్థితి వచ్చింది. బుమ్రా కూడా లేని సమయంలో కుల్దీప్‌కు అవకాశం ఇవ్వకపోవడం బాధాకరం. ఇలాంటి నిర్ణయాలు బౌలర్ ఆత్మవిశ్వాసం, లయపై ప్రతికూల ప్రభావం చూపుతాయి' అని యాష్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. ఇంగ్లండ్ పర్యటనలో కుల్దీప్‌కు టీ20 సిరీస్‌లో విశ్రాంతిని ఇచ్చింది. వన్డే సిరీస్‌లో ఉన్నా కూడా ఒక్క మ్యాచ్ ఆడే అవకాశం రాలేదు. మూడు వన్డేల్లోనూ అతను బెంచ్‌కే పరిమితమయ్యాడు. జట్టు యాజమాన్యం బ్యాటింగ్ డెప్త్ కోసం అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్‌లకు ప్రాధాన్యం ఇస్తుండగా.. కుల్దీప్ ప్రధాన బలం అయిన స్పిన్ బౌలింగ్‌కు తగిన గుర్తింపు దక్కడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. 118 వన్డేల్లో 194 వికెట్లు సాధించిన కుల్దీప్.. భారత జట్టుకు ఎన్నో విజయాలు అందించిన మ్యాచ్ విన్నర్‌గా గుర్తింపు పొందాడు. అయినప్పటికీ వరుసగా అవకాశాలు దక్కకపోవడంతో అతని భవిష్యత్తుపై ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చ సాగుతోంది. మహ్మద్ కైఫ్, రవిచంద్రన్ అశ్విన్ చేసిన వ్యాఖ్యలు జట్టు ఎంపిక విధానంపై మరోసారి చర్చకు దారితీశాయి.




# ముగిసిన 'మెస్సి' శకం

అంతర్జాతీయ ఫుట్‌బాల్ చరిత్రలోనే అత్యంత అద్భుతమైన, తిరుగులేని ఒక సువర్ణ శకం నేటితో ముగిసింది. సాకర్ ప్రపంచంలోనే ఆల్‌టైమ్ గ్రేటెస్ట్ ఆటగాడిగా నీరాజనాలు అందుకున్న అర్జెంటీనా లెజెండ్ లియోనెల్ మెస్సి, జాతీయ జట్టు తరఫున తన ఆఖరి అంతర్జాతీయ మ్యాచ్‌ను ఆడేసి బూట్లను పక్కన పెట్టేశాడు. ఫిఫా ప్రపంచకప్ 2026 ఫైనల్ మ్యాచ్‌లో స్పెయిన్ చేతిలో అర్జెంటీనా జట్టు పరాజయం పాలుకావడంతో, మెస్సి తన సుదీర్ఘ అంతర్జాతీయ ప్రస్థానాన్ని కన్నీళ్లతో ముగించాల్సి వచ్చింది. తన చివరి మ్యాచ్‌లో టైటిల్ గెలిచి ఘనంగా వీడ్కోలు పలకాలని ఆశించినప్పటికీ, రన్నరప్‌గా నిలవడంతో మైదానంలోనే తీవ్ర భావోద్వేగానికి గురై కన్నీటి పర్యంతవుతూ నిష్క్రమించాడు.

### 2016 లోనే ముగించాల్సింది కానీ..

నిజానికి మెస్సి అంతర్జాతీయ కెరీర్ పదేళ్ల క్రితమే, అంటే 2016లోనే ముగిసిపోవాల్సింది. 2014 ప్రపంచకప్ ఫైనల్‌లో జర్మనీ చేతిలో ఎదురైన ఓటమి, ఆ తర్వాత 2016 కోపా అమెరికా ఫైనల్‌లో చిలీ చేతిలో పెనాల్టీ షూటౌట్‌లో ఎదురైన పరాజయం ఆయనను మానసికంగా తీవ్రంగా కుంగిపోయేలా చేశాయి. వరుసగా ఫైనల్స్ వరకు వచ్చి టైటిల్స్ గెలవలేకపోతున్నాననే తీవ్ర నిరాశతో ఆ సమయంలోనే ఆయన అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు రిటైర్మెంట్ ప్రకటించేశాడు. కానీ, అర్జెంటీనా దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది అభిమానులు, మాజీ క్రీడాకారులు, ప్రభుత్వ పెద్దలు సైతం మెస్సి తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని పెద్ద ఎత్తున విజ్ఞప్తి చేయడంతో ఆయన తన ఆలోచనను మార్చుకుని మళ్లీ జాతీయ జెండాను భుజాన ఎత్తుకున్నాడు. తిరిగి వచ్చిన తర్వాత మెస్సి సృష్టించిన ప్రభంజనం ఫుట్‌బాల్ చరిత్రలోనే నిలిచిపోతుంది.

### వరుస టైటిళ్లు.. కెరీర్ పీక్స్

ఈ పదేళ్ల కాలంలో మెస్సి తన కెరీర్‌ను ఊహించని శిఖరాలకు తీసుకెళ్లాడు. అర్జెంటీనా జట్టును ముందుండి నడిపిస్తూ 2021 కోపా అమెరికా టైటిల్, ఆ తర్వాత క్రీడా ప్రపంచమే గర్వించేలా 2022 ఫిఫా ప్రపంచకప్ విజేతగా నిలబెట్టడమే కాకుండా, 2024 లో మరోసారి కోపా అమెరికా టైటిళ్లను తన ఖాతాలో వేసుకున్నాడు. ఆఖరి మ్యాచ్‌లో ఓటమి ఎదురైనప్పటికీ, ఒక ఫుట్‌బాల్ ఆటగాడిగా జాతీయ జట్టు తరఫున ఆయన సాధించాల్సినవన్నీ సాధించి, తన అంతర్జాతీయ ప్రస్థానాన్ని అత్యంత సంపూర్ణంగా, పరిపూర్ణంగా ముగించి సాకర్ సామ్రాజ్యానికి అజరామరుడిగా నిలిచిపోయాడు.

# రోహిత్ అరుదైన రికార్డు!



టీమిండియా స్టార్ ఓపెనర్, హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ అరుదైన రికార్డు నెలకొల్పాడు. ప్రతిష్టాత్మక లార్డ్స్ క్రికెట్ మైదానంలో వన్డేల్లో సెంచరీ చేసిన తొలి భారత బ్యాటర్‌గా రికార్డుల్లో నిలిచాడు. ఆదివారం ఇంగ్లండ్‌తో జరిగిన మూడో వన్డేలో సూపర్ సెంచరీతో హిట్‌మ్యాన్ ఈ రికార్డును ఖాతాలో వేసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో 110 బంతుల్లో 138 పరుగులు చేశాడు. 50 ఏళ్ల లార్డ్స్ చరిత్రలో ఓ టీమిండియా బ్యాటర్ సెంచరీ చేయడం ఇదే మొదటిసారి. ఈ రికార్డు మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్, కింగ్ విరాట్ కోహ్లీకి కూడా సాధ్యం కాలేదు.

### 53 ఏళ్లు గడిచినా:

1972లో లార్డ్స్‌లో తొలి వన్డే జరిగింది. ఇప్పటివరకు 53 ఏళ్లు గడిచినా.. ఏ టీమిండియా బ్యాటర్ కూడా లార్డ్స్‌లో శతకం బాధలేదు. ఎందరో దిగ్గజ భారత బ్యాటర్లు ఈ మైదానంలో ఆడినా.. ఇప్పటివరకు ఎవరూ వన్డేల్లో సెంచరీ చేయలేకపోయారు. ఆ లోటును ఇప్పుడు రోహిత్ శర్మ తీర్చాడు. ఇప్పటి వరకు లార్డ్స్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ పేరిట ఉంది. 2004లో ఇంగ్లండ్‌పై దాదా 119 బంతుల్లో 90 పరుగులు చేశాడు. ఇప్పుడు హిట్‌మ్యాన్ 138 పరుగులతో ఆ రికార్డును బద్దలు కొట్టాడు. ఈ ఇన్నింగ్స్‌తో గంగూలీ రెండో స్థానానికి పడిపోయాడు.

### మహ్మద్ కైఫ్ అజేయ ఇన్నింగ్స్:

లార్డ్స్‌లో భారత క్రికెట్ అభిమానులు ఎప్పటికీ మర్చిపోలేని ఇన్నింగ్స్‌లలో మహ్మద్ కైఫ్ అజేయ 87 పరుగుల ఇన్నింగ్స్ ముందువరుసలో ఉంటుంది. 2002 నాట్‌వెస్ట్ ట్రోఫీ ఫైనల్లో ఇంగ్లండ్ నిర్దేశించిన 326 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్ ఛేదించడంలో కైఫ్ కీలక పాత్ర పోషించాడు. ఆ చారిత్రాత్మక విజయానికి కైఫ్ ఇన్నింగ్స్ ప్రధాన కారణంగా నిలిచింది. లార్డ్స్‌లో భారత బ్యాటర్ల అత్యధిక వ్యక్తిగత స్కోర్ల జాబితాలో రోహిత్ శర్మ (138) అగ్రస్థానంలో ఉండగా.. సౌరవ్ గంగూలీ (90), మహ్మద్ కైఫ్ (87 నాటౌట్), సురేష్ రైనా (84), ఎంఎస్ ధోనీ (78 నాటౌట్), రాహుల్ ద్రవిడ్ (73 నాటౌట్), వీరేంద్ర సెహ్వాగ్ (71), యువరాజ్ సింగ్ (69), మొహిందర్ అమర్నాథ్ (58), సచిన్ టెండూల్కర్ (52), రాహుల్ ద్రవిడ్ (52) తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

### అత్యధిక వయసులో సెంచరీ:

ఈ శతకంతో రోహిత్ శర్మ మరో అరుదైన ఘనతను కూడా తన ఖాతాలో వేసుకున్నాడు. వన్డే క్రికెట్‌లో అత్యధిక వయసులో (39 ఏళ్ల 80 రోజులు) శతకం సాధించిన భారత బ్యాటర్‌గా నిలిచాడు. లార్డ్స్ వంటి ప్రతిష్టాత్మక వేదికపై ఈ ఘనత సాధించడం అతని ఇన్నింగ్స్‌కు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది. ఇంతకుముందు ఈ రికార్డు క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ (38 ఏళ్ల 327 రోజులు) పేరిట ఉండేది.

### మొత్తం 34 వన్డే శతకాలు:

లార్డ్స్‌లో ఇప్పటివరకు మొత్తం 34 వన్డే శతకాలు నమోదయ్యాయి. అక్కడ ఇంగ్లండ్ బ్యాటర్లు ఆధిపత్యం చెలాయించారు. ఇంగ్లండ్ మాజీ ఓపెనర్ మార్కస్ ట్రెస్కోతిక్ ఒక్కడే మూడు సెంచరీలు బాదాడు. 1975లో భారత జట్టుపై డెన్నిస్ ఎమ్మిస్ చేసిన 137 పరుగులు లార్డ్స్‌లో నమోదైన తొలి వన్డే శతకం కాగా.. 1979 ప్రపంచ కప్ ఫైనల్లో వెస్టిండీస్ దిగ్గజం వివియన్ రిచర్డ్స్ అజేయంగా చేసిన 138 పరుగులు ఈ వేదికపై అత్యధిక వ్యక్తిగత స్కోరు. తాజాగా బెన్ బకెట్ 141 పరుగులతో రిచర్డ్స్ రికార్డు బద్దలు కొట్టాడు. అలాగే కుమార సంగక్కర, రికీ పాంటింగ్, క్రిస్ గేల్, మార్టిన్ గప్టిల్, ఇమామ్ ఉల్ హక్ వంటి ప్రపంచ దిగ్గజాలు కూడా లార్డ్స్‌లో వన్డే శతకాలు సాధించారు.

# బిజినెస్

## బంగారం, వెండి ధరల్లో హెచ్చుతగ్గులు..


పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మళ్లీ మొదలయ్యాయి. ఇరాన్- అమెరికా దేశాలు మరోసారి యుద్ధానికి కాలు దువ్వాయి. దీంతో బంగారం, వెండి ధరల్లో మళ్లీ హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా గత వారం రోజులుగా పసిడి ధర పడిపోతూ వస్తోంది. ఈ నేపథ్యంలో ఇవాళ (సోమవారం) ఉదయం 07:00 గంటల సమయానికి భారతదేశంలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,43,280గా ఉంది. 22 క్యారెట్ల తులం గోల్డ్ రేటు రూ.1,31,340కి చేరింది. అలాగే 18 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,07,460గా ఉంది. ఇక, వెండి విషయానికి వస్తే కిలో ధర రూ.2,30,000కి చేరింది. హైదరాబాద్, విజయవాడ నగరాల్లో 24 క్యారెట్ల తులం పసిడి ధర రూ.1,43,280 ఉండగా.. 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,31,340కి చేరింది. వెండి కిలో ధర రూ.2,34,900గా ఉంది.




# హాట్‌స్పాట్‌తో 5జీ షేర్ చేస్తే డేటా కట్?




ఎయిర్‌టెల్ అపరిమిత 5జీ డేటా సేవలపై కొత్త వివాదం చెలరేగింది. గత రెండు రోజులుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఒక స్క్రీన్‌షాట్ ప్రకారం, అపరిమిత 5జీ ప్లాన్‌ను యాక్టివేట్ చేసుకున్న వినియోగదారులు మొబైల్ హాట్‌స్పాట్ ద్వారా ఆ డేటాను ఇతర పరికరాలతో పంచుకోలేరని, అలా ఉపయోగిస్తే డేటా 5జీ నుంచి కాకుండా రోజువారీ 4జీ డేటా కోటా నుంచి తగ్గుతుందని పేర్కొంది. ప్రస్తుతం ఎయిర్‌టెల్ అధికారిక నిబంధనల్లో ఈ షరతు కనిపించకపోయినా, ఈ సమాచారం సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీసింది. ల్యాప్‌టాప్‌ల కోసం మొబైల్ హాట్‌స్పాట్‌పై ఆధారపడే ఉద్యోగులు, విద్యార్థులు ఈ పరిమితిపై అసంతృప్తి వ్యక్తం చేస్తుండగా, కొందరు జియోకు మారాలని కూడా ప్రకటిస్తున్నారు. టెలికాం నిపుణులు చెబుతున్న దాని ప్రకారం, వినియోగదారులు హాట్‌స్పాట్ ఆన్ చేసినప్పుడు.. టెక్నికల్‌గా నెట్‌వర్క్ స్థాయిలో డేటా సిగ్నల్స్ (టీటీఎల్), ఆపరేటింగ్ సిస్టమ్ ఫింగర్‌ప్రింటింగ్, డీప్ ప్యాకెట్ ఇన్‌స్పెక్షన్ (డీపీఐ) వంటి అధునాతన సాంకేతికతల ద్వారా ఎయిర్‌టెల్ ఏ డివైజ్ కనెక్ట్ అయిందో సులభంగా పసిగట్టగలదని చెబుతున్నారు. మరోవైపు, కేవలం హాట్‌స్పాట్ పరిమితి మాత్రమే కాకుండా, అపరిమిత 5జీ అని ప్రచారం చేస్తున్నప్పటికీ.. ఎయిర్‌టెల్ నెలకు గరిష్టంగా 300జీబీ డేటా లిమిట్‌ను విధిస్తోందనే అంశంపై కూడా చర్చ జోరుగా సాగుతోంది. ఇదే సమయంలో ఎయిర్‌టెల్ ప్రధాన ప్రత్యర్థి రిలయన్స్ జియో మాత్రం పూర్తిగా భిన్నమైన వ్యూహాన్ని అనుసరిస్తోంది. తమ ట్రూ 5జీ కవరేజీ పరిధిలో ఎలాంటి ఆంక్షలు లేకుండా హాట్‌స్పాట్ ద్వారా కూడా అపరిమిత డేటాను వాడుకోవచ్చని జియో స్పష్టం చేసింది. మరోవైపు వొడాఫోన్ ఐడియా (వీఐ) కూడా హాట్‌స్పాట్‌పై పరిమితులు పెట్టనప్పటికీ, ఎయిర్‌టెల్ లాగే 28 రోజులకు 300జీబీ క్యాపింగ్ ఉంచింది. టెక్నాలజీ కంపెనీలు ఇలాంటి కఠిన నిబంధనలు విధిస్తే, వర్క్ ఫ్రమ్ హోమ్ చేసే కస్టమర్లు జియో వైపు మొగ్గు చూపే అవకాశం ఉందని, ఇది మార్కెట్ వాటాపై ప్రభావం చూపుతుందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.




# యాక్సెంచర్ కొత్త పే మోడల్

ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో వ్యయ నియంత్రణను కొనసాగిస్తూనే, ఎక్కువ మంది ఉద్యోగులకు వేతన పెంపు అందించేందుకు ప్రముఖ ఐటీ దిగ్గజం యాక్సెంచర్ కొత్త విధానాన్ని అమలు చేస్తోంది. ఈసారి జూన్ వేతన సవరణలో అర్హులైన ఉద్యోగులకు ఇచ్చే మొత్తం పెంపును రెండు సమాన భాగాలుగా విభజించాలని కంపెనీ నిర్ణయించింది. అంటే, పెంపులో సగం మూల వేతనంలో (బేస్ పే) కలపగా, మిగిలిన సగాన్ని జూన్‌లో ఒకేసారి ఇచ్చే నగదు చెల్లింపుగా అందిస్తుంది. ఉదాహరణకు, ఒక ఉద్యోగికి 3 శాతం పెంపు నిర్ణయిస్తే, అందులో 1.5 శాతం బేస్ పేలో చేరగా, మరో 1.5 శాతం లంప్‌సమ్‌గా చెల్లిస్తారు. దీంతో ఉద్యోగులకు వెంటనే అదనపు నగదు లభించడంతో పాటు, కంపెనీ పేరోల్‌పై దీర్ఘకాలిక భారం కూడా తగ్గుతుంది. గత ఏడాది పరిమిత స్థాయిలో మాత్రమే జీతాల పెంపు ఇచ్చిన యాక్సెంచర్, ఈసారి ఎక్కువ మంది ఉద్యోగులను కవర్ చేయడమే లక్ష్యంగా ఈ విధానాన్ని తీసుకొచ్చింది. అయితే పదోన్నతి పొందిన ఉద్యోగులకు ఈ 50:50 విధానం వర్తించదు. వారికి మొత్తం పెంపు పూర్తిగా మూల వేతనంలోనే కలుస్తుంది. అలాగే ఈ లంప్‌సమ్ చెల్లింపు డిసెంబర్‌లో ఇచ్చే వార్షిక బోనస్‌కు ప్రత్యామ్నాయం కాదని కంపెనీ స్పష్టం చేసింది. బేస్ పే పెంపు, లంప్‌సమ్ చెల్లింపు రెండూ కూడా ఉద్యోగి వార్షిక ఆదాయంలో భాగంగా పరిగణిస్తామని, ఉద్యోగి షేర్ కొనుగోలు పథకాల్లో ఉన్నవారికి ఈ చెల్లింపుపై సాధారణ కోతలు కూడా వర్తిస్తాయని కంపెనీ వెల్లడించింది.

# గ్యాస్ సిలిండర్ ధరలు

గత నెలలో గ్యాస్ సిలిండర్ ధరల పెరుగుదలపై ప్రజలు ఆందోళన చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఈ నెల(జులై) ఒకటో తేదీన కేంద్ర ప్రభుత్వం హోటళ్లు, రెస్టారెంట్లు తదితర వ్యాపారులకు ఊరటనిస్తూ కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించింది. 19 కేజీల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్‌పై రూ.183 తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో ప్రస్తుతం హైదరాబాద్‌లో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.3,191గా ఉంది. ఇక, గృహ వినియోగ ఎల్‌పిజి ధరల్లో ఎలాంటి మార్పులు లేవు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం.



### జులై 20వ తేదీన గ్యాస్ సిలిండర్ ధరలు..

హైదరాబాద్: రూ.994.00
వరంగల్: రూ.1013.00
విశాఖపట్నం: రూ.950.00
విజయవాడ: రూ.966.50
గుంటూరు: రూ.966.50



# దీపిక డెడికేషన్ నెక్ట్స్ లెవల్

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె ప్రస్తుతం ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'రాకా' చిత్రంలో కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా ప్రారంభమైన కొద్ది రోజులకే దీపిక గర్భవతి అయ్యారనే వార్తలు రావడంతో, ఆమె ఈ చిత్రంలో కొనసాగుతారా? లేక తప్పుకుంటారా? అనే సందేహాలు వ్యక్తమయ్యాయి. అయితే ఆ వార్తలకు తెరదించుతూ దీపిక ఈ సినిమా చిత్రీకరణలో కొనసాగుతున్నారు. ఈ చిత్రంలో దీపికపై భారీ యాక్షన్ సన్నివేశాలు ఉండనున్నట్లు ప్రచారం జరుగుతోంది.దీంతో వాటిని చిత్రబృందం ఎలా తెరకెక్కిస్తుందనే ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం దీపిక ఏడు నెలల గర్భంతో ఉన్నప్పటికీ, ఆమె యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొంటున్నట్లు సమాచారం. ఆమె భద్రత కోసం చిత్రబృందం ప్రత్యేక ఏర్పాట్లు చేసి, షూటింగ్‌ను శరవేగంగా కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. మరికొన్ని రోజుల్లో ఆమెకు సంబంధించిన సన్నివేశాల చిత్రీకరణను పూర్తి చేయాలని చిత్రబృందం భావిస్తున్నట్లు సమాచారం. ఏడు నెలల గర్భంతోనూ సినిమా కోసం అంకితభావంతో పనిచేస్తున్న దీపికను పలువురు ప్రశంసిస్తున్నారు.



# నెక్ట్స్ ప్లేస్‌లో 'ధురంధర్'

సినీ పరిశ్రమలో కొన్ని చిత్రాలు విడుదలై అద్భుతమైన రికార్డులను సృష్టిస్తుంటాయి. కాలక్రమేణా వాటిలో కొన్ని రికార్డులు ఇతర సినిమాల పేరిట నమోదవుతుంటే, మరికొన్ని మాత్రం ఎన్నేళ్లు గడిచినా చెక్కుచెదరకుండా నిలిచి ఉంటాయి. అలాంటి అరుదైన రికార్డుల్లో ఆర్ఆర్ఆర్ సినిమా పేరట కూడా ఓ రికార్డ్ ఉంది. 2022లో విడుదలైన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ. 1,300 కోట్లకు పైగా వసూళ్లు సాధించి ఘన విజయాన్ని అందుకుంది. అనంతరం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్‌కు వచ్చిన ఈ సినిమాకు ప్రపంచవ్యాప్తంగా విశేష ఆదరణ లభించింది.దీంతో 46.2 మిలియన్ వ్యూస్‌తో నెట్‌ఫ్లిక్స్‌లో అత్యధికంగా వీక్షించబడిన భారతీయ చిత్రంగా ఆర్ఆర్ఆర్ తొలి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత ఎన్నో భారతీయ సినిమాలు నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైనప్పటికీ, ఇప్పటివరకు ఏ చిత్రం కూడా ఆర్ఆర్ఆర్ రికార్డును అధిగమించలేకపోయింది. ఇటీవల ధురంధర్ సినిమా నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్‌కు వచ్చిన తర్వాత ఈ రికార్డును బద్దలు కొట్టే అవకాశాలు కనిపించాయి. అయితే ప్రస్తుతం ఆ చిత్రం 38.6 మిలియన్ వ్యూస్ మాత్రమే సాధించి, ఆర్ఆర్ఆర్ తర్వాత రెండో స్థానంలో కొనసాగుతోంది.

# అసలు ప్లాన్ అదేనా?




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ 'పుష్ప' సినిమాతో దేశవ్యాప్తంగా విశేషమైన గుర్తింపు సంపాదించుకున్నారు. దీంతో ఆయన వరుసగా పాన్ ఇండియా చిత్రాలపై దృష్టి సారిస్తున్నారు. అందులో భాగంగా ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'రాకా' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాను భారీ స్థాయిలో విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. ఈ సినిమా తర్వాత కూడా అల్లు అర్జున్ భారీ ప్రాజెక్టులకే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇప్పటికే ఆయన ముగ్గురు దర్శకులతో సినిమాలకు కమిట్ అయినట్లు సమాచారం. 'రాకా' చిత్రీకరణ పూర్త-య్యాక, లోకేష్ కనకరాజు దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నారు. ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ నిర్మించనుండగా, దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన ఇప్పటికే వెలువడింది. అనంతరం బసిల్ జోసెఫ్ దర్శకత్వంలో మరో సినిమా చేయనున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన చర్చలు కూడా పూర్తైనట్లు ప్రచారం జరుగుతోంది. ఆ తర్వాత సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో మరో భారీ చిత్రంలో నటించనున్నారు. ప్రస్తుతం ఒక సినిమాలో నటిస్తూనే, మరో మూడు భారీ ప్రాజెక్టులను లైన్లో పెట్టిన అల్లు అర్జున్ ఫుల్ జోష్‌లో ఉన్నారు. ముఖ్యంగా ఆయన కమిట్ అయిన చిత్రాల్లో రెండింటికి ఇతర భాషల దర్శకులు దర్శకత్వం వహించనున్న నేపథ్యంలో, తెలుగు ప్రేక్షకులతో పాటు దేశవ్యాప్తంగా మరింత క్రేజ్‌ను సొంతం చేసుకోవాలనే లక్ష్యంతో ఆయన ముందుకు సాగుతున్నట్లు సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# కూలీని టచ్ చేయడం కూడా కష్టమే





కోలీవుడ్ హిస్టరీలోనే జననాయగన్ చిత్రం రికార్డు స్థాయి ఓపెనింగ్స్‌ను నమోదు చేస్తుందని ఆశించిన అభిమానులకు, ట్రేడ్ వర్గాలకు ప్రస్తుత అడ్వాన్స్ బుకింగ్ ట్రెండ్స్ కొంత నిరాశను కలిగిస్తున్నాయి. ఇప్పటివరకు అందుతున్న అడ్వాన్స్ బుకింగ్స్ ప్రస్తుత ట్రెండ్ ని పరిశీలిస్తే ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రజనీకాంత్ కూలీ లేదా విజయ్ గత చిత్రం లియో సృష్టించిన ఓపెనింగ్స్ రికార్డులను అందుకునే అవకాశం లేదని స్పష్టమవుతోంది.ప్రస్తుత తరుణంలో ఈ సినిమా మొదటి రోజున ప్రపంచవ్యాప్తంగా కనీసం రూ. 100 కోట్ల గ్రాస్ ఓపెనింగ్‌ను అయినా సాధించగలదా అన్నదే ట్రేడ్ వర్గాల్లో పెద్ద ప్రశ్నగా మారింది. సాధారణంగా విజయ్ నటించిన గత చిత్రాలకు కనిపించే వారాంతపు బుకింగ్స్ రద్దీ మరియు అడ్వాన్స్ టికెట్ సేల్స్ జోరు, ఈ సినిమా విషయంలో ఆ స్థాయిలో కనిపించడం లేదు. ఈ చిత్రానికి సంబంధించి గతంలో జరిగిన కొన్ని నెగెటివ్ పరిణామాలు సినిమా ప్రీ-రిలీజ్ హైప్‌ను దెబ్బతీసినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా సినిమా ఆన్‌లైన్‌లో లీక్ కావడం అలాగే పలుమార్లు విడుదల వాయిదా పడటం వంటి అంశాలు సినిమాపై ఉన్న సహజమైన ఊపును తగ్గించేశాయి. అయితే థియేటర్లలోకి వచ్చిన తర్వాత మొదటి రోజే గనుక పాజిటివ్ టాక్ వస్తే బాక్సాఫీస్ గమనం పూర్తిగా మారిపోయి కలెక్షన్ల వర్షం కురిసే అవకాశం ఉంది. ప్రస్తుత ప్రతికూల పరిస్థితుల్లో ఇంతటి భారీ ఓపెనింగ్‌ను రాబట్టడం ఏ ఇతర స్టార్ హీరోకైనా దాదాపు అసాధ్యమైన పనే అని చెప్పాలి. కానీ సినిమాకు వ్యతిరేకంగా ఇన్ని అంశాలు ఉన్నప్పటికీ ఒక్క విజయ్ స్టార్‌డమ్ తిరుగులేని మాస్ ఫాలోయింగ్ మాత్రమే జననాయగన్ చిత్రాన్ని కోలీవుడ్‌లోనే వన్ ఆఫ్ ది బిగ్గెస్ట్ ఓపెనర్‌గా మారుస్తుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.




# రీ-రిలీజ్‌కు రెడీ అయిన 'ఖడ్గం'..

శ్రీకాంత్, రవితేజ, ప్రకాష్ రాజ్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'ఖడ్గం'. కృష్ణవంశీ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రానికి రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించారు. ఈ సినిమా 2002లో విడుదలై భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. ఆ తర్వాత ఎన్నోసార్లు బుల్లితెరపై ప్రసారమై విశేషమైన ఆదరణను పొందింది. ఇటీవలి కాలంలో అనేక సినిమాలు రీ-రిలీజ్ అవుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ దేశభక్తి ప్రధాన చిత్రాన్ని కూడా రీ-రిలీజ్ చేయడానికి మేకర్స్ సిద్ధమయ్యారు. ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటనను కూడా విడుదల చేశారు. ఈ చిత్రాన్ని ఆగస్టు 15న రీ-రిలీజ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. దేశభక్తి నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాను స్వాతంత్ర్య దినోత్సవం రోజున విడుదల చేయడం ఈ చిత్రానికి పెద్ద ప్లస్ కానుందని చాలామంది అభిప్రాయపడుతున్నారు. మరి రీ-రిలీజ్‌లో ఈ సినిమా ప్రేక్షకులను ఏ స్థాయిలో ఆకట్టుకుంటుందో చూడాలి.



# టైటిల్ వెనుక ఆసక్తికర కారణం

నందమూరి బాలకృష్ణ, కొరటాల శివ దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్న విషయం తెలిసిందే. కొంతకాలం క్రితమే ఈ చిత్రాన్ని పూజా కార్యక్రమాలతో అధికారికంగా ప్రారంభించారు. ప్రస్తుతం బాలకృష్ణ 'NBK111' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ పూర్తైన వెంటనే కొరటాల శివ దర్శకత్వంలోని చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకెళ్లనున్నట్లు సమాచారం. ఇక ఈ చిత్రానికి 'కార్పెంటర్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు, దాదాపు ఇదే టైటిల్‌ను ఖరారు చేయనున్నట్లు గత కొంతకాలంగా వార్తలు వైరల్ అవుతున్నాయి.ఈ టైటిల్‌ను పరిశీలించడానికి మేకర్స్‌కు ఓ ప్రధాన కారణం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో బాలకృష్ణ పాత్ర ఎంతో పవర్‌ఫుల్‌గా ఉండనుందని, వ్యవస్థ సక్రమంగా ఉండాలని, ప్రజలు బాగుండాలని కోరుకునే వ్యక్తిగా ఆయన కనిపించనున్నట్లు సమాచారం. అదే లక్ష్యానికి ఎవరైనా అడ్డుగా నిలిస్తే వారిని ఎదుర్కొనేందుకు ఏమాత్రం వెనుకాడని పాత్రలో బాలయ్య కనిపించనున్నారట. అందుకే ఈ కథకు 'కార్పెంటర్' అనే టైటిల్ సరిగ్గా సరిపోతుందని భావించిన మేకర్స్, అదే టైటిల్ వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. బాలకృష్ణ సినిమాకు 'కార్పెంటర్' వంటి విభిన్నమైన టైటిల్‌ను పరిశీలిస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై సినీ అభిమానుల్లో మరింత ఆసక్తి నెలకొంది.

# 100 కోట్లు ఇచ్చినా ఆ పని చేయను..



కోలీవుడ్ యంగ్ హీరోయిన్ ఐశ్వర్యలక్ష్మి ఇటీవల 'గట్ట కుస్తీ 2' సినిమాతో సూపర్ హిట్‌ను తన ఖాతాలో వేసుకున్నారు. ఈ సక్సెస్ ఎంజాయ్ చేస్తున్న ఐశ్వర్య ఒక ఇంటర్వ్యూలో పాల్గొని ఆసక్తికర కామెంట్స్ చేశారు. సినిమా కలెక్షన్ల నంబర్ల కంటే థియేటర్లలో జనాలు నవ్వుతుంటే చూడటమే తనకు నిజమైన సంతోషాన్ని ఇచ్చిందని ఐశ్వర్య లక్ష్మి చెప్పారు. కామెడీ చేయడం తనకు కొత్త అని, ఇందులో ఇంకా చాలా నేర్చుకోవాల్సి ఉందని అన్నారు. ఇక సోషల్ మీడియాకు దూరం కావడంపై ఐశ్వర్య మాట్లాడుతూ.. నెటిజన్ల ట్రోలింగ్, బాడీ షేమింగ్, ఫొటోలను మార్ఫింగ్ చేయడం వంటి కారణాల వల్ల తాను సోషల్ మీడియా అకౌంట్‌ను డిలీట్ చేసినట్లు చెప్పారు. అక్కడ తనకు ఎప్పుడూ రక్షణ ఉన్నట్లు అనిపించలేదని, నెగిటివ్ కామెంట్స్ వల్ల మనుషులతో మాట్లాడాలన్నా భయం వేసేదని అన్నారు.ఇప్పుడు సోషల్ మీడియా లేకపోవడం వల్లే ప్రశాంతంగా, సంతోషంగా ఉన్నానని.. ఎవరైనా రోజుకు రూ. 100 కోట్లు ఇస్తానన్నా మళ్లీ సోషల్ మీడియాలోకి రానని తేల్చి చెప్పారు. తన తదుపరి సినిమాల గురించి చెబుతూ.. ఐశ్వర్య ఆనంద్ దర్శకత్వంలో 1996 బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఒక తమిళ సినిమాలో లేడీ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నట్లు తెలిపారు. ఇది రెగ్యులర్ మాస్ సినిమా కాదని, చాలా విభిన్నంగా ఉంటుందని అన్నారు. అలాగే మలయాళంలో 'ఆశ' అనే సినిమాతో పాటు 'తీవినై పోట్రు', 'ఎలవ్' అనే రెండు వెబ్ సిరీస్‌లలో నటిస-ున్నట్లు చెప్పారు. అన్నిటికంటే ముఖ్యంగా తన బాలీవుడ్ ఎంట్రీ సినిమా పాత్ర చాలా అద్భుతంగా కుదిరిందని, ఆ క్యారెక్టర్ చేయడానికి తాను నిజంగా అర్హురాలినా అనే అనుమానం కూడా వచ్చిందని.. హిందీ ప్రేక్షకులు తన నటనను ఆదరిస్తారని ఆశిస్తున్నట్లు ఐశ్వర్య లక్ష్మి చెప్పుకొచ్చారు.ప్రస్తుతం ఈ కామెంట్స్ నెట్టింట చక్కర్లు కొడుతుండగా.. అమ్మడు షాకింగ్ నిర్ణయంపై రకరకాలుగా చర్చించుకుంటున్నారు.

Aishwarya Lekshmi

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**